మృత్యులేఖ!

అజీజ్

"మిస్టర్ సుగంధరావ్!

ఈ ఉత్తరాన్ని నువ్వు చదవడం పూర్తిచేసేలోపల నా నూరేళ్ళ జీవితాన్ని ఈ పాతికేళ్ళలోనే అంతం చేసుకోవాలని నిశ్చయించుకున్నాను.

అంతేకాదు, నా కడుపులో పెరుగుతున్న నీ ప్రతిరూపం కూడా నాతోబాటు అంతమౌతుంది. ఎందుకో తెలుసా? ఎప్పుడైతే ఈ రూపానికి నువ్వు 'తండ్రి' అనే అనుబంధపు లంకె వెయ్యడానికి నిరాకరించావో అప్పుడే ఆ ఆకృతి ఈ లోకంలో సజీవంగా కళ్ళు తెరిచే అర్హత కోల్పోయింది!

నిన్ను నమ్మేను. నిలువునా మోసపోయేను. అంతా అజ్ఞానం! పామరత్వం! నువ్వు నా యజమానివనీ, నేను నీ ఆఫీసులో నెలసరి భత్యంమీద పనిచేస్తూ, నీ కరుణా కటాక్షాలమీద బ్రతికే సామాన్య స్టెనోగ్రాఫర్నని తెలిసీ, నీకు భార్యా పిల్లలున్నారని తెలిసీ, నీ మాయ

మాటల్లోపడి బంగారు ఉచ్చులో బిగుసుకున్నానంటే, అదంతా నా అమాయకత్వం, మూర్ఖత్వం కాక మరేమిటి?

నీవు మేకతోలు కప్పుకున్న పులివి. పైకి స్త్రీ జనోద్ధరణకోసమే అవతారం ఎత్తినట్టూ, బడుగుజీవుల్ని ఉద్ధరించడానికే పుట్టినట్టూ ఊకదంపుడు ఉపన్యాసాలిస్తూ, అటు జనం అభిమానాన్ని చూరగొంటూ ఇటు రాజకీయ రంగంలో పునాదులు వేసుకుంటూ, లోలోన నా వంటి అమాయికలనెందర్ని కబళిస్తున్నావో ఎవ్వరికి తెలుసు?

నేనీ లోకానికి ఇహ మొహం చూపే అర్హత కోల్పోయాను. లజ్జాకర జీవితం గడుపుతూ, అనుక్షణం నరకాన్ని అనుభవించడంకంటే, క్షణికమైన మరణంతో స్వర్గాన్ని చేరడం మేలు.

నీవీ ఉత్తరం చదివేలోపల నా నిర్జీవశరీరం నా పడగదిలో మంచంమీద శాశ్వతనిద్రపోతూ వుంటుంది. నీలో ఏ కాస్త మానవత్వం, పశ్చాత్తాప హృదయం, పాపభీతీ వున్నా ఇకముందు నా వంటి అమాయికల జీవితాలతో చెలగాటమాడకు. మరణిస్తూ నేను కోరే చివరికోరిక ఇదే.

నా ఆత్మహత్యకి కారణాలేమిటో తెల్పే ఉత్తరమేదీ నేను వదిలి వెళ్ళడంలేదు. నీ బ్రతుకు బజారు పాలుచేసే నిదర్శనాలేవీ వదలడంలేదు. ఈ వుత్తరాన్ని కూడా కాల్చిపడేయ్!

పత్రికలకూ, పోలీసులకూ నీ నిగూఢ నిర్వాకలు తెల్పుతూ ఉత్తరాలు రాసివుంటే, నీకీ లోకంలో పుట్టగతులుకూడా వుండవు. ఏ ఎలక్షన్లో నిలబడి గద్దె నెక్కుదామని కలలు కంటున్నావో ఆ ఎలక్షన్లో నీ నామరూపాలుకూడా మిగలవు.

నీ మీద ప్రతీకారం తీర్చుకుందామనే ఉద్దేశం నాకే కోశానా లేదు. నా మంచితనమే నీకు శిక్ష. తీరని శిక్ష!

సెలవు
నిన్ను నమ్మి నట్టేట్లో మునిగిన—
క్షీరవేణి"

ఉత్తరం చదవడం పూర్తికాగానే సుగంధరావు వేళ్ళు అప్రయత్నంగా వణకడం ప్రారంభించాయి. గుండె గతి వేగం అందుకుంది. దిగ్భ్రాంతితో అతని కళ్ళు అవసరానికి మించి పెద్దవయ్యాయి.

పదినిమిషాల క్రితమే అతను ఆఫీసులో అడుగుపెట్టాడు. రాగానే టేబిల్ మీద పేపరువెయిట్ కింద పెట్టివున్న ఆ ఉత్తరంమీద పడింది దృష్టి!

కొంపదీసి తనకన్నా ముందు ఇంకెవ్వరూ చదవలేదు కదా దీన్ని? తనకన్నా పదినిమిషాలు ముందే వచ్చేస్తుంది స్టాఫంతా ఆఫీసుకి.

ప్యూన్ని పిల్చి కనుక్కుందామని కాలింగ్ బెల్ నొక్కేడు. అతను రాగానే, "ఈ వుత్తరం ఎవరు పెట్టారిక్కడ?" అడిగాడు.

"ఉత్తరమా? నేను పెట్టలేదు సార్!" అన్నాడు ప్యూన్ నోరు తెరుస్తూ.

"మరి ఎలా వచ్చిందిక్కడికి? నా కన్నా ముందు ఎవరైనా వచ్చారా?"

"లేదండి!"

"ఆఫీసు తెరిచాక నువ్వెక్కడికైనా వెళ్ళావా?"

"ఔనండి. ఆఫీసు తెరవగానే టేబిలూ, కుర్చీలూ తుడిచి, కూజాలో మంచినీళ్ళు నింపుకుందామని కెళ్ళానండి. అప్పుడే ఎవ్వరైనా..." నీళ్ళు నమిలాడు ప్యూన్.

"అఘోరించావు. ఆఫీసులో మిగతావాళ్ళంతా వచ్చేశారా?"

"మేనేజరుగారితో సహా అందరూ వచ్చేశారండి."

"ఐతే, క్షీరవేణి ఇంకా ఎందుకు రాలేదు?"

"ఇప్పటిదాకా నేనూ అదే అనుకుంటున్నానండి. ఆవిడ ఉద్జ్యోగంలో చేరిన ఈ మూడేళ్ళలోనూ ఎప్పుడూ ఇలా జరగలేదండి. మీకన్నా పదినిమిషాల ముందు ఠంచనుగా వచ్చేసే ఓరండి. మీరేమో ఈ రోజు..."

టేబిల్ మీది టెలిఫోన్ దగ్గరికి లాక్కుని రిసీవరందుకున్నాడు సుగంధరావు. గబగబ క్షీరవేణి ఫ్లాట్కు రింగ్ చేసి, రిసీవరు చెవికానించేడు. రెండు నిమిషాలు గడిచినా అవతలినించి రెస్పాన్స్ లేదు!

ఇంట్లో ఫోన్ మోగుతున్న శబ్దం స్పష్టంగా వినిపిస్తోంది. సుగంధరావు గుండెలో దడ ప్రారంభమైంది. నిశ్శబ్దంగా రిసీవర్ని రెస్టుమీదుంచాడు. అతని కళ్ళల్లో నిర్జీవంగా మంచంమీద పడున్న క్షీరవేణి శవం కదులుతోంది!

ఫ్యాన్ గాలికి టేబిల్ మీద రెపరెపలాడుతున్న ఉత్తరంమీద పడింది అతనిదృష్టి. ఎట్టి పరిస్థితిలోనూ ఈ ఉత్తరం మరో ప్రాణికంట పడకూడదు. దీనివల్ల తన సోషల్ పొలిటికల్ కెరియర్ మీద తీవ్రమైన కళంకం పులుముకునే ప్రమాదముంది!

అంతెందుకు, తనే మరొక్కసారి దాన్ని చదివితే, తనమీద తనకే అనుమానం కలగవచ్చు!! ఫ్యాన్ని పంచేసి, టేబిల్ మీంచి లైటర్, ఉత్తరం అందుకున్నాడు. లైటర్ వెలిగించి ఉత్తరం కొస అంటించాడు.

అరఠావుసైజు తెల్లకాగితం మీద ముత్యాలవంటి అక్షరాలతో రాసిన ఉత్తరం అది. కాగితం అంటుకో

గానే మంటలో బాటు తెల్లనిపొగ బైలుదేరింది. సుగంధ రావు దగ్గేడు.

దగ్గు క్రమంగా పొరలుపొరలుగా రాసాగింది. అవతల కూర్చున్న ఫ్యూన్ ఆ దగ్గువిని ఎక్కడ పరిగెత్తుకు వస్తాడో అని అరచేత్తో నోరు అదుముకున్నాడు. దాంతో ఉత్తరం కాస్తా చేతిలోంచి జారి కిందపడింది. ఇంకా సగం కాలకుండానే మంట ఆరిపోసాగింది.

2

“దొరగారు వచ్చేశారా?” అన్న కంఠం విని, స్టూల్ మీద కూర్చున్న ఫ్యూన్ ఉలిక్కిపడి తలెత్తాడు.

క్షీరవేణి!

“పావుగంట క్రితమే వచ్చేరండి. మిమ్మల్నడిగేరు. మీ ఇంటికి ఫోనుకూడా చేసినట్టున్నారండి” అన్నాడు ఫ్యూన్ లేచినిలబడుతూ.

“నేనింకా రాలేదని కోప్పడలేదు కదా?”

“లేదండి!”

“ఇంటనుంచి పావుగంటముందే బైలుదేరాను. దార్లో ఓ జులాయి వెధవ అల్లరిపెడితే పెద్దగొడవ జరిగింది. అందుకే ఇంత ఆలస్యమయ్యాను.”

“అయ్యో, ఆ వెధవని మక్కెలిరగదన్నారా, లేదా?”

“తన్నేవారే! తప్పించుకున్నాడు రాస్కెల్! ఐనా, వాడి కారు నెంబరు నోట్ చేసుకున్నాన్లే! అయ్యగారితో చెప్పి పోలీస్ కంప్లైంట్ ఇవ్వాలి” అంటూ స్ప్రింగ్ డోర్సు ముందాగి, “మే ఐ కమిన్ సర్?.’ అంది క్షీరవేణి.

లోపలినించి జవాబు లేదు.

క్షీరవేణి కనుబొమలు ముడిపడ్డాయి.

ప్రశ్నార్థకంగా చూసింది ఫ్యూన్ వైపు.

"లోపలే వున్నారండి" చెప్పాడతను స్వరం తగ్గించి.

"మే ఐ కమిన్ సర్?" అంది క్షీరవేణి మళ్ళీ.

నిశ్శబ్దం!

తను ఆలస్యంగా రావడంవల్ల ఆయనకోప్రం వచ్చి, పలకడం లేదేమో అనుకుంటూ సందేహిస్తూనే స్ప్రింగు డోర్సు తోసుకుంటూ లోన అడుగుపెట్టింది.

మరుక్షణం ఆశ్చర్యంతో ఆమె కళ్ళు పెద్దవయ్యాయి'

సుగంధరావు టేబిల్ మీద తల ఆనించి కూర్చునున్నాడు.

నిశ్శబ్దంగా!! చలనరహితంగా!!!

ఒంట్లో బాగులేదేమో? అనుకొంటూ కొద్దిగా దగ్గ—

"సార్!" పిల్చింది నెమ్మదిగా.

ఐనా, సుగంధరావులో ఉలుకూ, పలుకూ లేదు.

"సార్!" మళ్ళీ పిల్చింది.

జవాబు శూన్యం!

అతని దగ్గరికెళ్ళి తట్టేంతటి చనువు లేదామెకు. అందుకే, ప్యూన్ని కేకేసి లోపలికి పిల్చింది. అతను రాగానే అయోమయంగా ఆయనవైపు సైగ చేసింది.

"బాబుగారూ!" అంటూ సుగంధరావుని సమీపించేడు ప్యూన్.

అప్పుడు పడింది క్షీరవేణి దృష్టి, నేలమీద సగం కాలిన కాగితంమీద. వేలుపెడితే ధూళి తగలనంత నీట్‌గా వుండే ఈ ఆఫీసుగదిలో ఓ కాగితం కాలి పడుంటమా?

టేబిల్ కింద వేస్ట్‌బాక్సు వుంటుంది. సుగంధరావు వేస్ట్ కాగితాలని వుండగా చుట్టి అందులో పడేస్తాడుగానీ ఇలా కాల్చిపారేయడం ఇదివరకెన్నడూ జరగలేదు.

సూది మొనంత అశుభ్రత కూడా ఆమోదించని ఆయన యిలా ఎందుకు చేశాడు? అలోచిస్తూ ఆ కాగితం అందుకుంది.

అప్రయత్నంగా ఆమె దృష్టి అందులో రాసున్న చివరి నాలుగు పంక్తులమీద పడింది.

'నీ మీద పగతీర్చుకుందామనే ఉద్దేశం నాకే కోశానా లేదు. నా మంచితనమే నీకు శిక్ష! తీరని శిక్ష!!

సెలవు
నిన్ను నమ్మి నట్టేట్లో మునిగిన—
క్షీర వేణి.'

ఆశ్చర్యంతో క్షీర వేణి కళ్ళు విప్పారేయి. తాను రాసిందా ఈ ఉత్తరం? ఎప్పుడు? గబగబ మిగిలిన పంక్తులు కూడా చదివేసింది. అందులోని సారాంశం ఆమె ఆశ్చర్యాన్ని ఇంకింత అనునుడింప చేసింది!

తాను గర్భవతా? హవ్వ! అదీ సుగంధరావువల్లా? ఇక్కడ ఉద్యోగంలో చేరిన ఈ మూడేళ్ళలో ఏ నాడూ తనని పరీక్షగా కన్నెత్తి చూడని సుగంధరావుమీద ఇటువంటి నీతి బాహ్యమైన నింద మోపుతుందా తను?

ఎవ్వరు రాసుంటారిది? వుంది. తప్పకుండా యిందులో ఏదో గూడుపుఠాణీ వుంది...

అదే సమయంలో—"అమ్మగారూ?" అన్న ప్యూన్ గావుకేకతో ఉలిక్కిపడింది.

"దొరగారు చచ్చిపోయారండి!"

పక్కలో పిడుగుపడ్డట్టు అదిరిపడింది క్షీర వేణి. మరుక్షణం తనచేతిలోవున్న ఉత్తరం తాచుపాములా తోచిందామెకు.

చటుక్కున దాన్ని హాండ్ బాగులో పడేసి, "వెంటనే అందరికీ తెలియజెయ్!" అంటూ గబగబ బైటికి నడిచింది.

మరుక్షణం ఆ బిల్డింగులో పనిచేస్తున్న స్టాఫంతా ప్రళయం ముంచుకువచ్చినట్టు అక్కడికి పరిగెత్తుకొచ్చారు. కంపెనీ మేనేజర్ యోగానంద్ అందర్నీ బైటికి పంపి, టేబిల్ మీద టెలిఫోన్ అందుకుని, పోలీసులకి ఫోన్ చేశాడు.

పదినిమిషాల్లో వచ్చేశాయి పోలీస్ జీప్, అంబులెన్స్!

"శవాన్ని మొదట ఎవరు చూశారు?" అడిగాడు క్రయింబ్రాంచి ఇన్‌స్పెక్టర్ రాజారెడ్డి ఆఫీసులో అడుగు పెడుతూ.

"క్షీరవేణీ, ఆఫీసు ప్యూన్!" అంటూ వాళ్ళని పిలిపించి, ఇన్‌స్పెక్టర్‌కు పరిచయం చేశాడు మేనేజరు.

ప్యూన్ ద్వారా కొన్నినోటెడ్ పాయింట్స్ దొరికాయి ఇన్‌స్పెక్టరుకు.

సుగంధరావు ఆఫీసుకు రాగానే అతన్ని లోనికి పిల్చి ఏదో ఉత్తరం గురించి వాకబ్ చేశాడు.

తరవాత క్షీరవేణి గురించి అడిగాడు. ఆమె యింకా రాలేదని తెలిసి హడావుడిగా ఎవ్వరికో ఫోన్ చేశాడు. మరుక్షణం ఆయన మొహం రంగులు మారింది. ప్యూన్ని వెళ్ళిపొమ్మన్నాడు...

రోజూ క్రమం తప్పకుండా కరెక్టైంకు ఆఫీసులో వుండే క్షీరవేణి ఆరోజు అరగంట ఆలస్యంగా వచ్చింది!

ఇన్‌స్పెక్టర్ కళ్ళు చకచక టేబులుమీద వెదికాయి. సుగంధరావు ప్యూన్‌కు చూపిన ఉత్తరమేదీ లేదు టేబులుమీద, ఆయన శవం తప్ప.

"ఉత్తరం ఎక్కడుంది?" అడిగేడు ఇన్‌స్పెక్టర్ ప్యూన్ని.

"ఇక్కడే వుండాలండి. ఆయన సాయంగా చూపేరు నాకు" అన్నాడు ప్యూన్ ఆశ్చర్యంగా.

కింద కలయజూశాడు ఇన్‌స్పెక్టర్. అప్పుడు పడిందతని దృష్టి, నేలమీద కొద్దిగా కాలినకాగితపు బూడిదమీద. వంగి చూసేడు పరీక్షగా. బూడిదగా మారిన ఆ ముక్కల్లో చేతివ్రాత స్పష్టంగా కనిపిస్తోంది.

వేస్ట్‌బాక్స్‌లోంచి చిన్నకాగితం అందుకుని, ఆ బూడిదని అందులోకి ఊది పొట్లం కట్టి జేబులో వేసుకున్నాడు.

పోలీస్ డాక్టరు శవం రిగర్ మార్టిస్ని పరీక్షించడం, ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్ట్స్, ఫోటోగ్రాఫర్సు చకచక తమ పనులు ముగించడం, శవం స్ట్రెచర్ మీద ఆంబులెన్స్‌లోకి తరలివెళ్ళడం నిమిషాలమీద జరిగిపోయాయి.

అందర్నీ బైటికి పంపి, క్షీరవేణిని కూర్చోబెట్టి రొటీన్ క్వశ్చన్స్ ప్రారంభించేడు ఇన్‌స్పెక్టర్.

"మీరిక్కడ అపాయింట్ అయి ఎన్నాళ్ళయింది?"

"మూడేళ్ళు!"

"ఎన్నడూ ఆఫీసుకు ఆలస్యంగా రానిమీరు, ఈరోజు లేటయ్యారు! కారణం?"

"ఇంటినించి పావుగంట ముందే బైలుదేరాను. దార్లో ఓ పోకిరీ వెధవ అల్లరి పెడితే గొడవ జరిగింది. నలుగురూ గుమిగూడేసరికి వాడు కారెక్కి పారిపోయాడు. నేనా కారు నెంబరు నోట్ చేసుకున్నాను" అంటూ తన హాండ్ బాగులోంచి డైరీతీసి నెంబరు చూపెట్టింది క్షీరవేణి.

నెంబరు ఎ.జెడ్. 14520. బ్లూ ఫియట్ కారు.

ఆ వివరాలు తన డైరీలో ఎక్కించేడు ఇన్‌స్పెక్టరు.

డైరీని హాండ్ బాగులో పడేసి, సగంకాలిన ఆ వుత్తరం బైటికి తీసింది క్షీరవేణి.

"ఏమిటిది?" ఇన్‌స్పెక్టర్ కనుబొమలు ముడిపడ్డాయి.

తను ఆఫీసులో అడుగుపెట్టడం, సుగంధరావు నిశ్చలంగా కూర్చునుండటం, నేలమీద కొద్దిగా కాలిపడున్న ఆ ఉత్తరం కనిపించడం పూసగుచ్చినట్టు వివరించింది క్షీరవేణి.

దాన్నందుకుని పరిశీలించిన ఇన్ స్పెక్టర్ కళ్ళు ఆశ్చర్యంతో విప్పారేయి.

"కింద మీ సంతకం వుంది. మీరు రాయలేదంటారా ఈ ఉత్తరం?"

"లేదు. అసలు మా మధ్య అటువంటి హేయమైన సంబంధం లేనేలేదు. ఎవరు రాశారో, ఎందుకు రాశారో నాకేటూ అర్థం కాకుండా వుంది. అందులోని హాండ్ రైటింగు నాది కాదు."

ఇన్ స్పెక్టర్ నవ్వి—"ఇటువంటి ఉత్తరాలు రాసేటప్పుడు హాండ్ రైటింగు మార్చడం పెద్దసమస్య కాదే! మరొకరిచేత రాయించే అవకాశం కూడా వుంది కదా?"

"అదే నిజమైతే నా అంతట నేను ఆ ఉత్తరం తీసి మీకు దేనికి చూపిస్తాను? ఐనా ప్రాణాలతో నిక్షేపంగా వుండి, ఆయనమీద అటువంటి అభాండాలు వేస్తూ ఆత్మహత్య చేసుకుంటున్నానని రాసే ఖర్మ నాకేం పట్టింది? గిట్టని వాళ్ళెవ్వరో పనిగట్టుకుని ఇటువంటి పోకిరీపనికి దిగి వుంటారని నా అనుమానం!"

ఇన్ స్పెక్టర్ బుర్ర చురుగ్గా పనిచెయ్యసాగింది. ఉత్తరాన్ని మరోసారి పరిశీలించేడు. అక్షరాలు అందంగా, పొందికగా, గుండ్రంగా వున్నాయి. ఆత్మహత్య చేసుకోబోతున్న వ్యక్తి అంత నింపాదిగా, ఆహ్లాదంగా అక్షరాలు కూర్చి రాయలేడు.

క్షీరవేణి వాదం సమంజసంగానే వుంది. ఐతే,

ఎవ్వరు చేస్తుంటారీ పని? రోజూ ఠంచనుగా ఆఫీసుకు వచ్చే క్షీరవేణికి ఆ రోజు ఓ రోడ్ సైడ్ రోమియోవల్ల ఆలస్యమైంది.

ఈ ఉత్తరం పోస్టులో రాలేదు. ఫ్యాన్ కూజా నింపుకు రావడానికి బైటకెళ్ళినప్పుడే ఎవ్వరో చడీచప్పుడు కాకుండా ఆఫీసులో ప్రవేశించి టేబులుపైన పెట్టి వెళ్ళుంటారు.

సుగంధరావు రాగానే దాన్ని చూసేడు. చదివేడు. కాల్చేడు. ఐతే, అది పూర్తిగా కాలకముందే నేలమీద దేనికి పడేశాడు? ఈ ఉత్తరం కాలుతున్నప్పుడే ఆతని ప్రాణం పోయిందా? ఎలా? హార్ట్ ఎటాకా?

పోస్ట్ మార్టం రిపోర్టందేవరకూ ఇదిమిద్ధంగా ఏమీ తెలియదు. తెలియని మిస్టరీ అల్లా ఈ ఉత్తరమే! ఎవ్వరు రాశారు? ఎందుకు రాశారు? అతన్ని అపఖ్యాతిపాలు చెయ్యడానికా?

మద్రాసు మహానగరంలో సుగంధరావు గురించి తెలియనివాళ్ళు బహుఅరుదు. నగరంలో పెద్ద బిజినెస్ మాగ్నెట్స్‌లో ఆయనొకరు. 'ఎస్. ఆర్. ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్ట్' అనే పెద్ద సంస్థకు ఆయన యజమాని. అంతేకాదు, కొద్దిరోజుల్లో జరగబోయే ఎం. పీ. ఎలక్షన్స్‌లో కోడంబాకం నియోజక వర్గంనుండి పోటీ చెయ్యబోతున్నాడాయన. ఆ ఎలక్షన్స్‌లో సుగంధరావు అవలీలగా గెలుస్తాడని అందరూ అనుకొంటున్నారు.

అందుకు కారణం లేకపోలేదు. అతనిది మచ్చలేని క్యారెక్టర్. ఇటు ప్రజల్లోనూ, అటు ప్రభుత్వం దృష్టిలోనూ ఆయనకు మంచి ఖ్యాతివుంది. స్వచ్ఛంద సేవా సంస్థలెన్నిటికో ఆయన చేతికి ఎముక లేకుండా ధన

సహాయం చేశాడు. అనాథ శరణాలయాలెన్నిటికో భూరి విరాళాలిచ్చాడు.

రాజకీయాల్లో ప్రవేశించింది కూడా ఆయన మిత్రుల బలవంతం మీదనే! ఆ ఎన్నికల్లో ఆయన ప్రత్యర్థిగా డాక్టర్ గోపాలవర్మ పోటీ చేస్తున్నాడు. సుగంధరావు ముందు అతను ఘోరపరాజయం పొందక తప్పదనీ, చిత్తుగా ఓడి తీరతాడనీ, డిపాజిట్ కూడా దక్కదనీ, ఇప్పటినించే చెవులు కొరుక్కుంటున్నారు జనం!

సుగంధరావు గాక, ఇంకెవరైనా ఈ ఎన్నికల్లో నిలబడుంటే గోపాలవర్మ తప్పకుండా గెలిచే అవకాశా లున్నాయని రాజకీయ పరిశీలకుల అభిప్రాయం.

అటువంటి సుగంధరావు ఇలా హఠాత్తుగా చని పోయాడని తెలిస్తే నగరమంతా నిర్ఘాంతబోదూ?

ఆలోచనలు కట్టిపెట్టి, క్షీరవేణి వైపు చూశాడు ఇన్‌స్పెక్టర్. "దార్లో మిమ్మల్ని ఆటకాయించి అల్లరి పెట్టిన యువకుడెలా వుంటాడు?" అడిగేడు.

"సుమారు పాతికేళ్ళుంటాయి. చామనఛాయ. నార్మల్ హైట్. లావు పెదాలు. హిప్పీ జులపాలు. ఎడం చెంపమీద ఎప్పుడో దెబ్బతగిలి కుట్లు వేసిన గాయం. ఇదీ అతని అవతారం"

అవసరమైతే మళ్ళీ వచ్చి కలుసుకుంటానని చెప్పి, ఆమె చిరునామా, ఫోన్ నెంబరు నోట్ చేసుకుని, అక్క ణ్ణించి బైలుదేరాడు ఇన్‌స్పెక్టరు.

3

హెడ్ క్వార్టర్స్ చేరగానే దేవిడ్‌ని పిల్చి, క్షీరవేణి యిచ్చిన కారు నెంబరు రాసిచ్చి, ఆ కారు ఎవరిదో కనుక్కోవలసిందిగా పురమాయించాడు.

అంతలో సుగంధరావు శవం తాలూకు పోస్ట్‌మార్టం రిపోర్టు అందింది. ఆ రిపోర్టు చదివేక, ఇన్‌స్పెక్టర్ బుర్ర గిరగిర తిరగసాగింది.

సుగంధరావుది సహజమరణం కాదు!

హార్టుఎటాక్ అంతకన్నా కాదు.

విషప్రయోగం జరిగింది.

ఐతే, విషం జీర్ణకోశంలో గానీ, ప్రేవుల్లో గానీ ఎక్కడా కానరాలేదు. ఇంజక్షన్ రూపంలో శరీరంలోకి యివ్వబడలేదు. కేవలం కంఠనాళికలోనూ, ఊపిరితిత్తుల్లోనూ అక్కడక్కడ అతుక్కునుంది.

ఇన్‌స్పెక్టర్ మస్తిష్కంలో సవాలక్ష సందేహాలూ, అనుమానాలూ ఉవ్వెత్తున లేచి పడసాగాయి.

ఈ హత్య ఎలా జరిగింది?

సుగంధరావు ఆఫీసులో అడుగు పెట్టినప్పటినించీ, క్షీరవాణి పిల్చేవరకూ ప్యూన్ బైటేవున్నాడు. ఆమె తప్ప లోనికెవ్వరూ వెళ్ళలేదు.

ఇతరులకు విషప్రయోగం చేసే అవకాశాలేవీ లేవు.

ఐతే, అతని ఊపిరితిత్తుల్లో ఎలా చేరింది విషం?

తీవ్రంగా ఆలోచిస్తున్న ఇన్‌స్పెక్టరు బుర్రలో తళుక్కుమంది ఓ ఆలోచన.

సుగంధరావు టేబులుమీద దొరికిన ఆ ఉత్తరం తీసి చూసేడు పరీక్షగా. వెంటనే ఓ ఐడియా స్ఫురించింది. సాలోచనగా తలూపుతూ లేచి నిల్చున్నాడు కుర్చీలోంచి.

అదేసమయంలో సార్జంట్ డేవిడ్ స్ప్రింగు డోర్సు తోసుకుంటూ లోనికి వచ్చి "ఆ కారు ఎవ్వరిదో కనుక్కున్నాను సార్" అన్నాడు.

"ఎవ్వరిది?"

"ప్రొఫెసర్ పాండురంగానిది."

"గుడ్. అతని అడ్రస్ ఏమిటి?"

"డోర్ నెంబరు 3-1-146, తంబుచెట్టి స్ట్రీట్."

"ప్రొఫెసర్ వయసెంతుంటుంది?"

"నలభై నలభైఅయిదు మధ్య."

"బహుశా, ఆ యువకుడు అతని ఇంటివాడే అయుంటాడు. సరే, ఇప్పుడు నేనో ప్రయోగం చెయ్యబోతున్నాను. పద నా ఇంటికి" అంటూ సార్జంట్‌ని వెంట బెట్టుకుని జీప్ ఎక్కాడు ఇన్‌స్పెక్టర్.

ఇల్లు చేరగానే నౌకర్ని పిలిచి, "కిచన్ రూంలో ఎలకలబోను పెట్టావా?" అడిచాడు.

"పెట్టానండి."

"ఏమైనా పడ్డాయా అందులో?"

నౌకరు నెత్తిగోక్కుని, "చూశ్నేదండి!" అన్నాడు.

"చూడు. పడితే బోనూ, ఓ టవల్ పట్రా."

సార్జంట్‌కూ, నౌఖరుకూ ఇన్‌స్పెక్టర్ ధోరణి వింతగా తోచింది. మారుమాటాడకుండా లోనికెళ్ళి, రెండు నిమిషాల్లో తిరిగి వచ్చాడు నౌకరు. అతని చేతిలో ఎలకల బోనూ, ఓ టర్కీ టవల్ వున్నాయి.

"ఒక్కటే పడిందండి" అంటూ తెచ్చి టేబులు మీదుంచాడు.

బోనులో బందీ అయిన ఎలక, తప్పించుకోడానికి మార్గంకోసం నానాప్రయత్నాలూ చేస్తోంది. ఇన్‌స్పెక్టర్ జేబులోంచి ఆ వుత్తరం తీసి, అందులో పైభాగం సగం చింపి, లైటర్‌తో అంటించి, చటుక్కున బోనులో పడేసి, బోనుచుట్టూ టవలుకప్పి ముక్కు మూసుకున్నాడు.

ఆశ్చర్యంతో కళ్ళు విప్పార్చి, ఆ చర్యలు చూస్తూ నిల్చున్నాడు సార్జంట్.

ఐదునిమిషాల తరవాత, బోనుమీద కప్పిన టవలు తీసేశాడు ఇన్‌స్పెక్టర్.

దిగ్భ్రాంతితో సార్జంట్ నోరు తెరుచుకుంది.

బోనులో అంతవరకూ అటూయిటూ గెంతుతున్న ఎలక —

ఇప్పుడు చచ్చిపడుంది.

ఇన్‌స్పెక్టరు పెదాలపై మందహాసం మెరిసి మాయమయింది.

నాఖరుద్వారా ఆ బోను అక్కణ్నించి తీయించి, సార్జంటుని కూర్చోమని సైగచేశాడు.

"మనం మొదట అనుకున్నట్టు సుగంధరావుది సహజ మరణంకాదు. పదహారణాల హత్య. ఇంతవరకూ ఎవరూ అనుసరించని ఓ కొత్తపంథాలో పటిష్టమయిన పథకం వేసి ఆ హత్య జరపబడింది.

ఆయనకు రాయబడ్డ ఉత్తరం మామూలు ఉత్తరం కాదు. మృత్యులేఖ! ఆ ఉత్తరం రాసిన యింకులో అత్యంత ప్రమాదకరమయిన విషం కలపబడింది. ఆ విషం లోని ప్రత్యేకత ఏమిటంటే, దాన్ని ఏ వస్తువుమీదైనా చిలికి, ఆ వస్తువును కాలిస్తే తక్షణం అది విషతుల్యమైన గ్యాస్ విడుదల చేస్తుంది. ఆ గ్యాస్ పీల్చినప్రాణి మరణించడానికి అరక్షణం పట్టదు.

ఈ పద్ధతినే సుగంధరావు హత్యకు వినియోగించారు. ఆ విషం కలిపిన ఇంకుతో అతనిలో విపరీతమైన భయాందోళనలు కలిగేలా ఉత్తరం రాశారు. ఆఫీసు ఫ్యూను నీళ్ళు నింపుకు రావడానికి బయిటకెళ్ళిన అదను చూసి, నిశ్శబ్దంగా దాన్ని తీసుకెళ్ళి, టేబిల్ మీదుంచారు.

అతను రాగానే ముందా ఉత్తరంమీద దృష్టిపడింది.

చదివాడు. నిరాంతపోయాడు. సందేహ నివృత్తికోసం క్షీరవేణి ఇంటికి ఫోన్ చేశాడు. ఆమె పలక్కపోయేసరికి నిజంగానే ఆత్మహత్య చేసుకొనుంటుందని భ్రమపడి, తన పరువు నష్టేట్లోకలిపే ఆ ఉత్తరాన్ని నామరూపాలు లేకుండా చెయ్యాలనే ఉద్దేశంతో కాల్చి బూడిద చేద్దామని నిప్పంటించాడు.

మరుక్షణం విషం తన ప్రభావాన్ని చూపెట్టింది. నిప్పంటుకోగానే అది ఉత్పత్తిచేసిన గ్యాస్ సుగంధ రావు ఊపిరిగుండా అతనిలో ప్రవేశించింది. టేబిల్ మీద అలాగే ఒరిగిపోయాడు. కాలుతున్న కాగితం చేతిలోంచి జారి కిందపడి ఆరిపోయింది.

ఇక్కడ మనం తర్కించవలసిన పాయింట్స్ యేమిటంటే, హంతకుడు సుగంధరావుని భయపెట్టడానికి క్షీరవేణినే ఎందుకెన్నుకున్నాడు? అందుబాటులోవున్నదనా? ఇంటినుంచి సరిగ్గా సమయానికి బయలదేరిన ఆమెని దార్లో అల్లరిపాలు చేసింది కేవలం ఆమె సుగంధరావు కన్నా ముందు ఆఫీసుకెళ్ళకూడదనా?

ఒకవేళ క్షీరవేణి రోజూలాగే సుగంధరావుకన్నా ముందు ఆఫీసు చేరివుంటే, ఆ ఉత్తరాని కర్థం ఉండేది కాదు. సుగంధరావు ఆమె ఇంటికి ఫోన్ చేసి ఆందోళన పడేవాడుకాదు.

ఇక హత్యకు కారణం ఆలోచించాలి. కొద్దిరోజుల్లో లోకసభకు ఎన్నికలు జరగబోతున్నాయి. అందులో సుగంధరావు పోటీచెయ్యబోతున్నాడు. ఆ యెన్నికల్లో అతను గెలవడం ఖాయమని అందరూ అనుకుంటున్నారు.

అతనికి వ్యతిరేకంగా పోటీ చెయ్యబోతున్న డాక్టరు గోపాలవర్మకు ఘోరాపజయం తప్పదని వినికిడి. ఈ పరిస్థితుల దృష్ట్యా ఇది రాజకీయ హత్య ఎందుక్కాకూడదు.

తన విజయావకాశాలకు అడ్డుగోడగా దాపురించిన సుగంధరావును యేదోరీతిని మట్టుబెట్టాలన్న కసితో గోపాలవర్మ ఈ హత్యకు పథకం అల్లాడేమో? పైగా, అతను డాక్టరు. పాయిజన్స్ గురించి అతనికి తెలిసినంత క్షుణ్ణంగా మరెవ్వరికీ తెలీదు.

ఇక్కడ మరో విషయం గమనించాలి. ఆ ఉత్తరాన్ని అతనే స్వయంగా తీసికెళ్ళి సుగంధరావు బల్లమీద పెట్టి వుండడు. తన రాజకీయ ప్రత్యర్థి ఆఫీసు పరిసరాల్లోనే అతని ఉనికి ప్రమాదకరమయినది గనక!

ఆ పనికి అతను మరెవ్వరి సహాయమో తీసుకునుంటాడు. అలా సాయపడ్డ వ్యక్తి ఆ ఆఫీసు ఉద్యోగుల్లోనే ఎవరో ఎందుకు కాకూడదు? మనమక్కడకి వెళ్ళినప్పుడు నేనా వుద్యోగులందర్నీ పరిశీలించాను.

ఎందుకో ఆ కంపెనీ మేనేజరు యోగానంద్ మీద నా కనుమానం ఉంది. కారణం, యజమాని అకాల మృత్యువు ఆందోళనగానీ, విభ్రాంతిగానీ అతని ముఖంలో ఏకోశానా కన్పించలేదు.

పైగా, అటువంటి సంఘటనేదో జరిగి తీరుతుందని అతనికి తెలిసివున్నట్టూ, జరగవలసిందే జరిగినట్టూ చాలా నిర్లిప్తంగా, భావరహితంగా కనిపించాడు.

నువ్వతన్నోకంట కనిపెడుతూండు. విడవకుండా ఫాలో చెయ్. ఎక్కడికి వెళ్తున్నాడు? ఎవర్ని కలుసు కుంటున్నాడు? వారిమధ్య సాగే సంభాషణ, అన్నీ నోట్ చెయ్.

ఎందుకయినా మంచిది, క్షీరవేణినికూడా ఓకంట కనిపెట్టి వుండటానికి ఓ మఫ్టీ కానిస్టేబుల్ని నియమించాలి. ముందు ఈ ఉత్తరాన్ని కెమికల్ టెస్ట్ కోసం

లేబొరేటరీలో అప్పగించు" అంటూ లేచాడు ఇన్‌స్పెక్టరు రాజారెడ్డి.

4

"ప్రొఫెసరు పాండురంగం గారున్నారు?"

"ఉన్నారండి."

"ఆయన్ని కలుసుకోవాలి," అంటూ విజిటింగ్ కార్డు నౌఖరు కందించాడు ఇన్‌స్పెక్టరు రాజారెడ్డి.

"డ్రాయింగురూంలో కూర్చోండి, పిల్చుకొస్తాను," అంటూ అతన్ని లోపకూర్చొబెట్టి వెళ్ళాడు నౌఖరు.

ఐదునిమిషాల తరవాత డ్రాయింగు రూంలో ప్రవేశించాడు ప్రొఫెసర్. ఏభైఏళ్ళుంటాయతనికి. క్లీన్ షేవ్. బట్టతల.

"హాలో ఇన్‌స్పెక్టర్! మీ గురించి తరుచూ పత్రికల్లో చదువుతుంటాను. ఈ రోజు మీరే మా యింటికి రావడం ముదావహం. బహుశా, ఏదో ఇన్వెస్టిగేషన్ వ్యవహారమే అయుంటుంది. చెప్పండి నా వల్ల ఏం సహాయం కావాలి?" అడిగాడు సోఫాలో కూర్చుంటూ.

రాజారెడ్డి జేబులోంచి డైరీ తీసి, "నెంబరు ఎ. జెడ్. 14520 బ్లూ ఫియట్ కారు మీదే కదూ?" అడిగాడు సూటిగా.

"ఔను. మాదే."

"దాన్ని మీరుగాక యింకెవరయినా వాడతారా?"

"నేనసలు దాన్ని ముట్టుకోను. నా దగ్గర రెండు కార్లున్నాయి. నేను వాడేది గ్రీన్ అంబాసిడరు. బ్లూఫియట్ మా అబ్బాయి రవికాంత్ వాడతాడు. ఇంతకీ ఏం జరిగింది? కొంపదీసి వాడేదైనా ఏక్సిడెంట్ చెయ్యలేదు కదా?" అడిగేడు ప్రొఫెసరు ఖంగారుగా.

"నో. నో! ఏక్సిడెంట్ కేసుకాదు. నిన్న వుదయం పదిగంటల ప్రాంతంలో మీ అబ్బాయి ఎక్కడున్నాడు?"

"కాలేజి కెళ్ళాడు!"

"ఇప్పుడెక్కడున్నాడు."

"ఐదునిమిషాల క్రితమే వెళ్ళాడు కాలేజీకి."

"ఏ కాలేజీలో చదువుతున్నాడు?"

"గాంధీ మెడికల్ కాలేజ్. మెడిసన్ సెకెండియర్ స్టూడెంటు."

"థాంక్స్. వస్తాను!" అంటూ లేచాడు ఇన్‌స్పెక్టరు.

"ఇంతకీ, సంగతేమిటో చెప్పలేదు మీరు!" అన్నాడు ప్రొఫెసరు అయోమయంగా.

"నిన్న ఉదయం పదిగంటల ప్రాంతంలో ఆఫీసుకెళ్తున్న ఓ అమ్మాయిని మీ అబ్బాయి అల్లరిపెట్టాడు. ఆమె గొడవపెట్టేసరికి కార్లో పారిపోయాడు. ఆమె ఆ కారునెంబరు నోట్ చేసుకుని మాకు కంప్లెంట్ ఇచ్చింది..."

"ఓహ్ గాడ్!" అంటూ నోరు తెరిచాడు ప్రొఫెసరు.

అతన్నలా వదిలేసి జీప్ ఎక్కాడు ఇన్‌స్పెక్టరు.

పావుగంటలో చేరుకున్నాడు మెడికల్ కాలేజి.

రవికాంత్‌ను కలుసుకోవడం పెద్ద కష్టంకాలేదు. అతన్ని చూడగానే ఇన్స్పెక్టరు ఆశ్చర్యం అవధులు దాటింది. క్షీరవేణి వర్ణించిన యువకుడికీ, ఇతనికీ యెక్కడా పోలికల్లేవు!

రవికాంత్ సన్నగా, పొడుగ్గా, ఎర్రగా వున్నాడు. ఉంగరాల జుత్తు. పల్చని పెదాలు. అతని కుడిచెంప మీదగానీ,ఒంటిమీద మరెక్కడగానీ వీసమెత్తు గాయం గుర్తులేదు!

ఇన్స్పెక్టరు అందించిన విజిటింగ్ కార్డు చూడగానే, ఆశ్చర్యపోయి, "మీరు క్రయింబ్రాంచి ఇన్స్పెక్టరా? నాతో ఏంపని?" అడిగేడు అయోమయంగా.

"నెంబరు 14520 బ్లూఫియట్ మీదే కదూ?"

"ఔను."

"నిన్న ఉదయం పదిగంటల ప్రాంతంలో మీ కారు ఎవ్వరికైనా యిచ్చారా?"

"ఔను. నా స్నేహితుడు అడిగితే ఇచ్చాను."

"ఎవ్వరతను?"

"ప్రసాద్!"

"ఎందుకిచ్చారు?"

"అర్జంటు పనుందనీ, వెంటనే తిరిగొస్తాననీ చెప్పి తీసికెళ్ళాడు."

"ప్రసాద్ ఇప్పుడు కాలేజీలో వున్నాడా?"

"ఇంకా రాలేదు!"

"మరొక్క ప్రశ్న. అతని కుడిచెంపమీద కుట్టువేసిన గాయమేదైనా వుందా?"

"ఔను. ఉంది. ఇంతకీ..."

"అతని ఇల్లెక్కడో తెలుసా మీకు?"

"నుంగంబాకంలో వున్నట్టు తెలుసుగానీ, వివరాలు తెలియవు!"

"ఆల్ రైట్! వస్తాను" అంటూ కదలబోయాడు ఇన్స్పెక్టరు.

"ఇంతకీ...

"మళ్ళీ వచ్చాక చెబుతాను. దయచేసి, నేనిలా వచ్చి వెళ్ళినట్టు అతనితో చెప్పకండి" అంటూ జీప్ ఎక్కాడు ఇన్స్పెక్టరు.

5

పావుగంటలో డాక్టర్ గోపాలవర్మ డిస్పెన్సరీ ముందు జీపాపి దిగాడు. వరండాలో రకరకాల రోగులు బెంచీల మీద బారులుదీరి కూర్చునున్నారు. కంపౌండరు కాబోలు ఒక్కొక్కరి వివరాలు రిజిస్టరులో రాసుకుంటూ ఒకరి తర్వాత ఒకర్ని లోపలికి పంపుతున్నాడు.

"డాక్టరుగారున్నారా?" అడిగాడు ఇన్స్పెక్టరు అతన్ని.

"ఉన్నారు!"

"ఆయన్ని కలుసుకోవాలి."

"వెయిట్ ప్లీజ్!" అంటూ బెంచీవైపు చూపాడు కంపౌండరు.

ఇన్స్పెక్టరు జేబులోంచి విజిటింగుకార్డు తీసి అతని ముందు గిరాటేశాడు.

దాన్ని చూడగానే అతను తలెత్తి, "పోలీస్ ఇన్స్పెక్టరా?" అన్నాడు నోరు తెరుస్తూ.

"ఔను. డ్యూటీమీద వచ్చాను"

కంపౌండరు లేచి, "డాక్టరుగారికి చెప్పొస్తాను" అంటూ లోనికెళ్ళాడు. రెండు నిమిషాల తర్వాత తిరిగి వచ్చి, "ఎవరొచ్చినా సరే, నెంబరు ప్రకారం లోపలికి పంపమన్నారు" అన్నాడు.

కోపంతో ఇన్స్పెక్టరు ఒళ్ళు భగ్గుమంది. కంపౌండరు చెప్పింది ఖాతరు చెయ్యకుండా, బూట్సు టకటక చప్పుడు చేసుకుంటూ, కన్సల్టింగు రూమువైపు నడిచి, స్ప్రింగు డోర్సు తోసుకుంటూ లోన అడుగుపెట్టాడు.

చప్పుడు విని తలెత్తి చూసిన డాక్టరు గోపాలవర్మ నోరు తెరిచి, "నెంబరు ప్రకారం పంపమన్నానుగా?

నా దగ్గరికి ఎవ్వరొచ్చినా రూల్సు ప్రకారం నడుచుకో వలసిందే!

"ఇక్కడ డిసిప్లిన్ మేంటనెన్స్ చెయ్యబడుతుంది. ఎవరో వచ్చారని రూల్సు సడలిస్తే రెండు గంటలనించీ వెయిటింగులో వున్న రోగుల గతి ఏంగాను?" అన్నాడు మొహాం చిట్లిస్తూ.

ఇన్స్పెక్టరు మౌనంగా త ఐడెంటిఫికేషన్ కార్డు తీసి అతని ముందు పడేశాడు.

"ఏమిటిది?"

"ఐడెంటిఫికేషన్ కార్డు!"

"కంపౌండరు చెప్పాడుగా మీ గురించి?"

"ఐనా మరొక్కసారి చదివి, మీ కర్తవ్యాన్ని గ్రహించండి."

డాక్టరు అయిష్టంగా ఐడెంటిఫికేషన్ కార్డందుకుని, "ఇన్స్పెక్టర్ రాజారెడ్డి ఫ్రం క్రయిం బ్రాంచ్, ఊఁ, నాతో ఏంపని?" అడిగాడు కనుబొమ ఎగరేస్తూ.

"ఓ ఇన్వెస్టిగేషన్ పనిమీద మీతో మాట్లాడాలి" అంటూ కుర్చీలో చతికిలబడి జేబులోంచి సిగరెట్ తీశాడు ఇన్స్పెక్టరు.

"ఇక్కడ సిగరెట్ కాల్చకండి, ఆ వాసన నాకు పడదు" ముక్కు మూసుకున్నాడు డాక్టరు.

"ఆల్ రైట్. ఐతే, మీరు నా వెంట రండి."

"ఎక్కడికి?"

"హెడ్ క్వార్టర్సుకు."

"ఎందుకూ?

"అక్కడే తెలుస్తుంది ఎందుకో!"

"ఒక మామూలు ఇన్స్పెక్టరు నన్ను పోలీస్ హెడ్

క్వార్టర్స్‌కు తీసుకెళ్తాననటమా? ఎంత ధైర్యం! నేనెవ్వరో తెలిసే మాట్లాడుతున్నారా? లేక, అల్లాటప్పునుకుంటున్నారా'' గుర్రుమన్నాడు డాక్టరు.

ఇన్స్పెక్టరు ముఖం జేవురించింది. ''ఒక మామూలు ఇన్స్పెక్టరు అనుమానంమీద ఎంతటి వాడినైనా మెడ బట్టి కటకటాల వెనక్కి తొయ్యగలడని మీకు తెలిసే వుంటుందనుకుంటాను.''

''నా మీద అనుమానమా? ఏ విషయంలో?''

''మీ ప్రత్యర్థి సుగంధరావు హత్య విషయంలో!''

''సుగంధరావు హత్య చెయ్యబడ్డాడా? నిన్న వుదయం హఠాత్తుగా చనిపోయాడని పేపర్లో చదివానే!''

''అతను అకారణంగా చావలేదు. విషప్రయోగం జరిగింది. ఆ విషం సామాన్యులెవ్వరికీ అందుబాటులో వుండదని ఖచ్చితంగా చెప్పవచ్చు.''

''ఐతే నేనేం చెయ్యాలి?''

''బేడీలు తొడుక్కోడానికి సిద్ధంగా వుండాలి!''

''మాటలు జాగ్రత్తగా రానివ్వండి. నన్ను అనుమానించడానికి మీ దగ్గర ఆధారాలున్నాయా?''

''కావలసినన్ని వున్నాయి! చెప్పమంటారా?''

''అఖ్ఖర్లేదు. నేనేమీ వినదల్చుకోలేదు. డి.ఎస్.పి.తో డి.ఐ.జి.తో మాట్లాడతాను. అందరూ నాకు తెలుసు. మీరిక వెళ్ళండి'' అంటూ ఒక్క ఉదుటున లేచి లోపలి కెళ్ళిపోయాడు డాక్టరు.

నీలాంటి వాళ్ళని ఎలా లొంగదీయాలో నాకు తెలుసు అనుకుంటూ లేచాడు ఇన్స్పెక్టరు.

జీప్ ఎక్కి మరోసారి మెడికల్ కాలేజికెళ్ళాడు. వాకబ్ చేస్తే ప్రసాద్ ఆ రోజు కాలేజీకి రాలేదని తెలిసింది.

అట్నుంచి తిన్నగా హెడ్ క్వార్టర్సుకు వెళ్ళి డి.ఎస్.పి.ని కలుసుకున్నాడు. ఆయనకు కేసు వివరాలన్నీ చెప్పి, డాక్టరు గోపాలవర్మ మీద తనకున్న అనుమానాలూ, అతను తనపట్ల ప్రవర్తించిన తీరూ వివరించేడు.

అంతా విన్న డి.ఎస్.పి. వెంటనే ఫోన్ దగ్గరికి లాక్కుని, డాక్టరు డిస్పెన్సరీకి రింగ్ చేశాడు.

"హలో...ఆఁ, నేను డి. ఎస్. పి. ని మాట్లాడుతున్నాను. డాక్టరుగారున్నారా డిస్పెన్సరీలో?"

"ఉన్నారండి" అవతలనించి వినిపించింది కంపౌండరు కంఠం.

"ఆయన్ని లైన్‌లోకి పిలువ్!"

"అలాగే సార్!" అవతల నిశ్శబ్దం.

రెండునిమిషాల తరవాత డాక్టరు కంఠం వినిపించింది. "హలో! డాక్టర్ గోపాలవర్మ స్పీకింగ్. డి.ఎస్.పి.గారా? నమస్కారం! నేనే మిమ్మల్ని కలుసుకోవాలనుకుంటున్నాను. ఇంతలో మీరే ఫోన్ చేశారు..."

డి.ఎస్.పి. అతని మాటలకడ్డుపడి, "సుగంధరావు హత్యకేసు పరిశోధిస్తున్న మా క్రైంబ్రాంచి ఇన్స్పెక్టరు రాజారెడ్డి మిమ్మల్ని కలుసుకోడానికి వస్తే అతనితో చాలా అమర్యాదగా ప్రవర్తించారుట.

ఇది సహించరాని విషయం! అనుమానంమీద ఎవ్వరైనా అరుస్టుచేసే అధికారాలు మాకున్నాయని మీరు గుర్తించాలి. మీరు పొలిటికల్ ఫీల్డులో బాగా పరపతి గలవారే కావచ్చు. అంతమాత్రాన మేము మా విధ్యుక్త ధర్మాలని సడలించుకుంటామనుకోడం భ్రమ!

ఇది ఒక ప్రముఖవ్యక్తి హత్యకేసు. అందుకే యీ

కేసును ఇన్స్పెక్టరు రాజారెడ్డి కప్పగించడం జరిగింది. అతనెంతో బాధ్యతగల పోలీసాఫీసరు. అర్థం లేకుండా మిమ్మల్ని కలుసుకోడానికి వచ్చాడనడం అర్థరహితం!

మీకూ, నాకూ వున్న పరిచయం కేవలం వ్యక్తిగతం! మీకు డి. ఐ. జి. గారితో పరిచయంవున్నా, ఐ. జి. పి. గారితో పరిచయంవున్నా మా కర్తవ్య నిర్వహణలో ఏ పరిచయాలూ ప్రతిబంధకాలు కాలేవు.

ఈ సాయంత్రం మీ డిస్పెన్సరీ మూసేశాక, ఇన్స్పెక్టర్ రాజారెడ్డి తిన్నగా మీ ఇంటికి వచ్చి మిమ్మల్ని కలుసుకుంటాడు. అతని ప్రశ్నలకి సరైన జవాబులిచ్చి, సహాకరించగలరని ఆశిస్తున్నాను. సెలవ్!'' అంటూ యింకేమీ వినిపించుకోకుండా రిసీవర్ దించేశాడు డి.ఎస్.పి.

6

సాయంత్రం సరిగ్గా ఆరుగంటలకు డాక్టరుయింటికి బైలుదేరాడు ఇన్స్పెక్టర్. అతని యింటిముందు జీప్ ఆపి దిగాడో లేదో, సరిగ్గా అదే సమయంలో రెడ్ ఆస్టిన్ కారొకటి ఆ యింటి కాంపౌండ్లోకి తిరుగుతూ సడన్ బ్రేక్తో ఆగింది.

డ్రైవింగ్ సీట్లో కూర్చున్న వ్యక్తిని చూడగానే, ఇన్స్పెక్టరు భ్రుకుటి ముడిపడింది. అతను సుగంధరావు కంపెనీ మేనేజరు యోగానంద్!

ఇన్స్పెక్టర్ని చూడగానే అతను చిరునవ్వు నవ్వి— ''హలో సార్! ఏమిటిలా వచ్చారు?'' అంటూ పలకరించాడు.

''ఏంలేదు. డాక్టర్ గోపాలవర్మగార్ని చూసిపోదామని వచ్చాను. పోతే, మీరిక్కడికి రావడం నాకు చాలా ఆశ్చర్యంగా వుంది.''

"ఎందుకూ?"

"సుగంధరావుకూ, గోపాలవర్మకూ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది కదా? అటువంటప్పుడు మీ రాయన శత్రువు యింటికి రావడం విడ్డూరమే కదా?"

యోగానంద్ నవ్వి "సుగంధరావుగారి దగ్గర నేను ఉద్యోగినన్న మాట నిజమేగానీ, వాళ్ళ వ్యక్తిగత శత్రుత్వాలతో నాకేంపని చెప్పండి? గోపాలవర్మ నా ఫామిలీ డాక్టరు. అవసరమైనప్పుడల్లా వచ్చి ఆయన్ని కలుసుకుంటూంటాను. ఇందులో ఏదైనా తప్పుందంటారా?" అన్నాడు.

"లేదనుకోండి. సరే, ముందు మీరే వెళ్ళి కలుసుకోండి ఆయన్ని. నాకవతల మరో పనుంది. తరవాత వచ్చి కలుసుకుంటాను" అంటూ జీప్ యెక్కాడు ఇన్స్పెక్టరు.

యోగానంద్ ఆస్టిన్ కారు కంపౌండ్‌లోకి వెళ్ళింది.

యోగానంద్‌ని నీడలా వెంబడిస్తూ ఓ కంట కనిపెట్ట మన సార్జంట్ దేవిడ్‌ని నియమించేడు తను. అంటే దేవిడ్ కూడా యోగానంద్ వెనక ఇక్కడికి వచ్చి ఎక్కడో పొంచివుంటాడు, అనుకుంటూ కలయజూశాడు రాజారెడ్డి.

ఎదురుగా రోడ్డుపక్క ఓ టాక్సీ ఆగివుంది. టాక్సీ బాక్‌సీట్లో కూర్చున్నాడు దేవిడ్. జీప్‌లో వస్తున్న ఇన్స్పెక్టర్ని చూడగానే టాక్సీ దిగాడు.

జీప్ కు బ్రేక్ వేసి,-"యోగానంద్ విషయంలో ఏదైనా అనుమానాస్పద సంఘటనలు జరిగాయా?" అడిగాడు యిన్స్పెక్టరు.

"హాత్య జరిగినప్పట్నించీ అత నెవ్వర్నీ కలుసుకోలేదు.

ఇల్లువిడిచి ఎక్కడికీ వెళ్ళలేదు. ఇప్పుడే బైలుదేరి ఇక్కడికి వచ్చాడు" అన్నాడు డేవిడ్.

"అతనూ, డాక్టరు ఏం మాట్లాడుకుంటున్నారో నీవు వినే అవకాశం బొత్తిగా లేదు. నెవర్ మైండ్! బైటికి రాగానే విడవకుండా ఫాలో చెయ్" అంటూ జీప్ ముందుకు పోనిచ్చాడు ఇన్స్పెక్టర్.

సార్జంట్ తిరిగి టాక్సీ బాక్ సీట్లోకి చేరి, డాక్టరు యింటివైపు చూడసాగాడు. పావుగంట తరవాత బైటికి వచ్చింది యోగానంద్ ఆస్టిన్ కారు. ఇప్పుడు కార్లో అతనేకాదు, మరోవ్యక్తి కూడా వున్నాడు.

ఎవరతను?

కారు ఎడంవైపు తిరిగి స్పీడందుకుంది.

టాక్సీని దాని వెనక పోనివ్వమని డ్రైవరుతో చెప్పాడు డేవిడ్. కారు స్టార్టయి ఆస్టిన్ కారుకు వంద గజాల ఇవతల వుండి వెంబడించ సాగింది.

ఆలివర్ రోడ్ దాటి, మోబ్రిస్ రోడ్ గుండా ట్రిప్లికేన్ హైవేలోకి తిరిగింది కారు. అలా కొద్దిదూరం వెళ్ళి లాటిస్ బ్రిడ్జి రూట్ లోకి మళ్ళింది. సామాన్యంగా ఆ రోడ్డుమీద అట్టే జనసంచారం ఉండదు. అప్పటికే నగరంలో లైట్లు వెలిగాయి.

హఠాత్తుగా ముందు వెళుతున్న కారు స్పీడు స్లో అయింది. ఫ్రంటుసీట్ తలుపు తెరచుకుంది. మరుక్షణం ఓ మానవాకారం పిండిబస్తాలా కిందికి దొర్లింది. అంతే! కారు వాయువేగంతో ముందుకు దూసుకోపోసాగింది.

"డ్రయివర్! ఆ వ్యక్తి పడున్నచోట కారాపు!" అరిచాడు డేవిడ్.

రెండుక్షణాల్లో రోడ్డుమీద పడున్న ఆ మానవాకా

రాన్ని సమీపించి సడన్ బ్రేకుతో ఆగింది టాక్సీ. ఒక్క ఉదుటన తలుపు తెరుచుకుని దిగి,ఆ వ్యక్తిని సమీపించేడు డేవిడ్.

అతనెవరో కాదు. యోగానంద్ ప్రక్కన కారులో కూర్చున్న వ్యక్తే.

ప్రాణంలేని పీనుగులా చేతులూ, కాళ్ళూ ముడుచుకు పడున్నాడు. చటుక్కున వంగి అతని పల్స్ చూశాడు డేవిడ్. కొట్టుకొంటోంది బలహీనంగా.

ఇంకా ప్రాణం పోలేదు. తక్షణం అతన్ని హాస్పిటల్ చేర్చాలి. ప్రాణాపాయం తప్పితే, అతనిద్వారా ఏం జరిగిందో తెలుసుకోవచ్చు. డ్రైవర్ సహాయంతో అతన్ని ఎత్తి టాక్సీ బాక్ సీట్లోకి చేర్చాడు డేవిడ్.

"వెంటనే జనరల్ హాస్పిటల్ పోనివ్" అన్నాడు తనూ ఎక్కుతూ. టాక్సీ వెనుదిరిగి, పావుగంటలో చేరుకుంది హాస్పిటల్.

అతన్ని హాస్పిటల్లో చేర్పించి, అచ్చటనుంచే పోలీస్ హెడ్ క్వార్టర్సుకు ఫోన్ చేసి, ఇన్స్పెక్టరు రాజారెడ్డిని తక్షణం హాస్పిటల్ కు రమ్మని చెప్పాడు.

జీపులో హుటాహుటిన వచ్చాడు ఇన్స్పెక్టరు. అతన్ని చూడగానే గుర్తుపట్టాడు. ఉదయం డిస్పెన్సరీలో చూసిన కంపౌండరు అతను.

డాక్టర్ అతని చెయ్యందుకుని పల్సుచూసి, "పోయాడు" అంటూ చెయ్యి జారవిడిచాడు.

నిరాశతో నిట్టూర్చాడు ఇన్స్పెక్టరు.

"బహుశా యోగానంద్ ఇతన్ని బ్రిడ్జిమీంచి కింద ప్రవహించే మురుకి కాలవలోకి తోసెయ్యాలనే ఉద్దేశంతోనే ఆవైపు తీసుకెళ్ళుంటాడని నా అనుమానం. వెనక

మీ టాక్సీ వస్తుండటం చూసి, రోడ్డుమీదకితోసి పారి పోయుంటాడు.

ఇతనికి విషప్రయోగం జరిగిందో లేదో, శవపరీక్షలో తేలుతుంది. శవాన్ని పోస్ట్‌మార్టంకు పంపి, హెడ్ క్వార్టర్సుకు వచ్చేయ్'' అని సార్జంటుతో చెప్పి, జీప్ ఎక్కాడు ఇన్స్‌పెక్టరు.

7

తన ఆఫీసులో కూర్చుని తీవ్రాలోచనల్లో నిమగ్న మయ్యాడు రాజారెడ్డి. యోగానంద్ కార్లోంచి కంపౌండరు కిందికి తొయ్యబడటం, అనూహ్యమయిన పరిస్థితిలో అతని దుర్మరణం, వీటన్నిటినిబట్టి ఆలోచిస్తే సుగంధరావు హత్యకూ, యోగానంద్‌కూ అవినాభావ సంబంధమున్నట్టు ధృవపడింది.

బహుశా అతనే డాక్టరుగోపాలవర్మతో కుమ్మక్కయి సుగంధరావుని మట్టుబెట్టి వుంటాడు. దానివల్ల అతని కొరిగే లాభమేమిటో అతనిద్వారానే తెలియాలి.

కంపౌండరు హత్యలోనూ యేదో నిగూఢ రహస్యం ఇమిడి వుంటుంది. బహుశా, సుగంధరావు హత్యకోసం అతన్ని ఏదో విధంగా వాడుకునుంటారు. లేదా, ఆ హత్యకు సంబంధించిన వివరాలేవో అతనికి తెలిసుంటాయి. అతన్ని మట్టుబెట్టడం తప్పనిసరి అని తలచి వుంటారు వాళ్ళు.

ఇక జాగు చెయ్యడం అనవసరం. అనుమానంమీద డాక్టరు గోపాలవర్మనూ, యోగానంద్‌నీ వెంటనే అరెస్ట్ చెయ్యాలి, అనుకుంటూ లేచాడు ఇన్స్‌పెక్టరు.

సరిగ్గా అదే సమయంలో, టేబిల్ మీద టెలిఫోన్ మోగింది. రిసీవరందుకుని, ''ఎస్, ఇన్స్‌పెక్టర్ రాజారెడ్డి హియర్,'' అన్నాడు.

“నేను సార్! సుగంధరావు స్టెనోగ్రాఫరు క్షీరవేణిని కనిపెట్టడానికి నియమించిన కానిస్టేబుల్ని. ఆమె అడయారులో ఉన్న శాంతినిలయం అనే మూడంతస్థుల బిల్డింగులో, ఫ్లాటు నెంబర్ అరవైనాలుగులో నివసిస్తోంది.

ఉదయంనించీ నేనా ఫ్లాటుమీద కన్నేసివుంచేను. ఆమె తలుపు మూసుకుని లోపలేవుంది. సూర్యాస్తమయం వేళ సుగంధరావు కంపెనీ మేనేజరు యోగానంద్ ఆమె ఫ్లాటులో ప్రవేశించి, వెంటనే తిరిగి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళగానే ఆమె ఖంగారుగా బయటకువచ్చి, కాసేపు అటూ ఇటూ పచార్లుచేసి తిరిగి లోనికెళ్ళి తలుపేసుకుంది. ఆమెతీరు చూస్తోంటే తీవ్రమయిన భయాందోళనకు గురయివున్నట్టు కనిపించింది.

ఆ తరవాత కొద్దిసేపటి క్రితమే, అంటే యెనిమిది గంటల ప్రాంతంలో మళ్ళీవచ్చి, ఆమె ఫ్లాటు తలుపు తట్టేడు. క్షీరవేణి తెరవలేదు. పది నిమిషాలవరకు అతను తలుపు తెరవడానికి ప్రయత్నించి, విసుగెత్తి వెళ్ళిపోయాడు. ఇది నోటెడ్ న్యూస్ గనక మీకు తెలీజేస్తున్నాను.” అన్నాడు అవతలనుంచి కానిస్టేబుల్.

“ఆల్ రైట్! అక్కడేవుండు. అతను మళ్ళీవస్తే విడవకుండా ఫాలోచెయ్” అని రిసీవరు దించి, జేబులోనుంచి డైరీతీశాడు ఇన్స్పెక్టర్.

ఆ బిల్డింగులో పెద్దపెద్ద ఉద్యోగాలు చేస్తున్న మనుషులూ, వ్యాపారస్థులూ నివసిస్తుంటారు. డైరీలో క్షీరవేణి ఇచ్చిన ఫోన్ నెంబరు చూసుకొని డయల్ చేసి, రిసీవరందుకున్నాడు.

“యూ డామ్ ఫూల్, ఈడియట్, ఇది లాస్ట్ వార్నింగ్, మళ్ళీగనక నాకు ఫోన్ చేశావో, పోలీస్ రిపోర్టు

ఇస్తాను జాగ్రత్త,'' అవతలినుంచి అరచింది క్షీరవేణి.

''మిస్, క్షీరవేణీ, నేను ఇన్స్పెక్టర్ రాజారెడ్డిని.''

''మై గాడ్...మీరా! నేనా రోగ్ మళ్ళీ ఫోన్ చేశా డనుకున్నాను.'.

''ఎవ్వరు?''

''యోగానంద్!''

''ఏం జరిగింది?''

''సాయంత్రం ఐదుగంటల ప్రాంతంలో అతను అను కోకుండా నా దగ్గరకు వచ్చాడు. నేను చా... డల్ గా కనిపిస్తున్నాననీ, క్లబ్బులకూ, సినిమాలకూ వెళ్ళి కాస్త రిలాక్స్ అవడం మంచిదనీ ఉచిత సలహాలివ్వసాగాడు.

నేనందుకు నిరాకరించడంతో ఉగ్రుడై, సుగంధరావు గారి మరణానికి కారణం నేనే అన్న విషయం తనొక్క డికే తెలుసునని, ఆ సంగతి ఇంకా పోలీసుల దృష్టికి తేలేదని, ఆ విషయం వాళ్ళకు తెలిస్తే జీవితాంతం కట కటాల వెనక గ్రమగ్గవలసి వస్తుందనీ, తను చెప్పినట్టు నడుచుకుంటే ఏ చిక్కూ వుండదనీ హెచ్చరించాడు.

అతని కంఠంలో ఒకరకం బెదిరింపువుంది. అలా బెది రించి వెళ్ళిపోయాడు. ఆ తరవాత రాత్రి ఎనిమిదిగంటల ప్రాంతంలో మళ్ళీవచ్చాడు. నేను తలుపు తియ్యలేదు. పది నిముషాలు ప్రయత్నించి వెళ్ళిపోయాడు.

గంటక్రితం నాకు ఫోన్ చేసి మళ్ళీ బెదిరించాడు. ఇప్పుడు మరోసారి ఫోన్ మోగడంతో వాడే అను కున్నాను. ఎందుకో నాకు అతన్ని చూస్తే కంపరం పుడు తోంది.

సుగంధరావుగారి ఆఫీసులో దొరికిన ఉత్తరాన్ని నేను మీకందచేసిన విషయం బహుశా అతనికి తెలీదను

కుంటాను. అందుకే అలా బెదిరిస్తున్నాడు. నాకెందుకో అతనిమీద అనుమానంగావుంది. ఇన్స్పెక్టరుగారూ, దయచేసి నాకు ప్రాణాపాయం జరక్కుండా రక్షణ కల్పించండి.''

''నే వచ్చేవరకూ తలుపు తెరవకుండా యింట్లోనే ఉండండి'' అంటూ రిసీవర్ క్రెడిల్ చేసి, గబగబ బయటకు నడిచాడు ఇన్స్పెక్టర్.

జీప్ యెక్కి పావుగంటలో చేరుకున్నాడు శాంతి నిలయం! బిల్డింగు చివర చిరుచీకట్లో జీప్ ఆపి దిగాడు. చకచక అడుగులు వేసుకుంటూ బిల్డింగులో ప్రవేశించే మెట్లవైపు నడిచాడు.

అప్పుడు పడింది ఇన్స్పెక్టర్ దృష్టి, మెట్లకు కాస్త ఎడంగా కూర్చుని ముష్టెత్తుకుంటూన్న ఓ బికారిమీద.

ఇన్స్పెక్టర్ని చూడగానే మట్టిచిప్ప ముందుకుచాచి, ''కబోదిని బాబూ, దర్మం సెయ్యండి. మీ పిల్లాపాపలు సల్లంగ వుండాలి'' అంటూ అడుక్కోసాగాడు.

ఇన్స్పెక్టర్ కర్థమయింది, అతను క్షీరవేణిమీద నిఘా కోసం నియమించిన డిటెక్టివ్ కానిస్టేబిల్ అని. జేబిలో చెయ్యివేసి చిల్లరనాణాలు తీస్తున్నట్లు నటిస్తూ అతన్ని సమీపించాడు.

ఇన్స్పెక్టర్ దగ్గరకు రాగానే ''నేను వన్ నాట్ త్రీని సార్. పదినిమిషాల క్రితం యోగానంద్ వచ్చాడు మళ్ళీ క్షీరవేణి దగ్గరకి. ఈసారికూడా ఆమె తలుపు తియ్యలేదు. చాలాసేపు ప్రయత్నించి, విసుక్కుంటూ వెళ్ళిపోయాడు, అదుగో, ఎదురుగావున్న ఆ సందులోకి. నేను ఆ సందుని సమీపించేలోగానే అతని కారు స్టార్టయి స్పీడ్ గా వెళ్ళిపోయింది'' అన్నాడు కానిస్టేబుల్.

ఇన్స్పెక్టర్ సాలోచనగా తలూపి, మెట్లవేపు నడిచేడు. గబగబ మెట్లెక్కుతూ అయిదు నిముషాల్లో చేరుకున్నాడు సెకండ్ ఫ్లోర్. క్షీరవేణి ఫ్లాట్ తలుపుమూసి వుంది. మునివేళ్ళతో తట్టాడు మెల్లిగా.

"ఎవ్వరు?" ఆమె కంఠంలో కంపన.

"నేను ఇన్స్పెక్టర్ రాజారెడ్డిని."

గబగబ వస్తున్న అడుగుల సవ్వడి. గడియ తీస్తోన్న శబ్దం. తలుపు తెరచుకుంది. "హమ్మయ్య, ఇప్పుడుగానీ నాగుండె దడ తగ్గలేదు. లోపలకి రండి" అంటూ తలుపు కడ్డం తొలిగింది క్షీరవేణి.

"మీరిక్కడ వంటరిగా వుండటం ఏ క్షణంలోనైనా ప్రమాదం కొని తెచ్చుకున్నట్టు అవుతుంది. యోగానంద్ ఇన్నిసార్లు మీ యింటిచుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు అంటే తప్పకుండా అతను మీకేదో హాని తలపెట్టే ప్రయత్నంలో వున్నాడన్నమాట.

మిమ్మల్నిచ్చట ఒంటరిగా వుంచేబదులు, ఏదయినా సురక్షిత ప్రదేశానికి తరలించడం మేలనిపిస్తోంది. ఏమంటారు?" అన్నాడు యిన్స్పెక్టర్ లోన అడుగు పెడుతూ.

"నాకు ప్రమాదం జరగకుండా కాపాడే పూచీ మీది. మీకెలా ఉచితంగాతోస్తే అలాగే చెయ్యండి" అంది క్షీరవేణి.

"అయితే ఇంటికి తాళ వేసి పదండి. సాధ్యపడితే ఈరాత్రే యోగానంద్ ని మా కస్టడీలోకి తీసుకోవాలనుకుంటున్నాను. లేదా, రేపెలాగయినా వాణ్ణి అరెస్టు చెయ్యాక తప్పదు. పదండి" అంటూ బయటకు నడిచేడు ఇన్స్పెక్టర్.

క్షీరవేణి చెప్పులు వేసుకుని, తాళంకప్ప అందుకొని, గదుల్లో వెలుగుతున్న లైట్లార్పి బయటకి వచ్చింది. తలుపుకు తాళంవేసి ఇద్దరూ మెట్లవైపు నడిచారు.

కింద బీకారి అవతారంలోవున్న కానిస్టేబుల్ యింకా అక్కడే కూర్చునున్నాడు. "ఇక నీ అవసరంలేదు. వెళ్ళి రెస్టు తీసుకో" అన్నాడు ఇన్స్పెక్టర్ అతనితో.

కానిస్టేబుల్ లేచి, కంబళి దులుపుకుని భుజాన వేసుకున్నాడు.

క్షీరవేణిని వెంటపెట్టుకుని జీప్ వున్నవేపు నడిచాడు. ఇద్దరూ అందులో కూర్చున్నారు. ఇంజన్ స్టార్ట్ చెయ్యబోతుండగా, చీకట్లో ఎవ్వరో వారివేపు పరిగెత్తుకు వస్తున్న బూట్లశబ్దం వినిపించింది. ఆ రెప్పపాటు వ్యవధిలోనే ఏదో ప్రమాదం జరగబోతున్నట్లు మెరుపు మెరిసింది ఇన్స్పెక్టర్ బుర్రలో.

క్షీరవేణిని అమాంతం తనమీదికి లాక్కుని వొరిగిపోయాడు సీట్లో. వాళ్ళలా ఒరగడం, "ఢాం, ఢాం" అనే చప్పుళ్ళతో దిక్కులు పిక్కటిల్లడం లిప్తపాటులో జరిగిపోయాయి.

మరుక్షణం ఆ అడుగుల శబ్దం పరిగెత్తుతున్నట్టు వినిపించకంతో కొద్దిగా తలెత్తిచూశాడు ఇన్స్పెక్టర్. రోడ్డు కవతలివైపు వున్న సందువైపు పరిగెత్తుతున్నాడతను.

కాలరు చెవులవరకూ ఎత్తిపెట్టుకున్న డార్క్‌బూడిద రంగు లాంగ్‌కోటు. ఆ దేరంగు పాంటు. తలిమీద ఫెల్ట్ హాట్. ఆ ఒడ్డూ, పొడుగూ అచ్చువేసినట్టు యోగానంద్ లాగే వుంది.

క్షీరవేణిని జీప్‌లోనే వదలి, జేబులోంచి పిస్తోలు తీస్తూ కిందికి గెంతాడు ఇన్స్పెక్టర్. క్షణం వృధాచేయకుండా తనూ ఆ సందువేపు పరుగుతీశాడు.

సందులో చీకటి.

జనసంచారం శూన్యం.

పరిగెత్తుతున్న యోగానంద్ ఆకృతి లీలగా కనిపిస్తూ వుంది. అడుగుల శబ్దం స్పష్టంగా వినిపిస్తోంది. హఠాత్తుగా అతను వెనుదిరిగి, పిస్తోలు పేల్చాడు.

"ఢాం!" మనే శబ్దంతో సందు గింగురుమంది.

గుండు రంయ్‌మంటూ ఇన్స్‌పెక్టర్ చెవి పక్కనుంచి దూసుకుపోయింది. తనూ ఫైర్ చేశాడు కావాలని గురి తప్పేలా. దాని కతన్నుంచి జవాబువచ్చింది. గుళ్ళు లెక్క పెట్టాడు ఇన్స్‌పెక్టర్. యోగానంద్ పిస్తోలులో ఇప్పుడు రెండే గుళ్ళు మిగిలాయి. ఆ రెండూ ఖర్చయితే అతన్ని సులభంగా లొంగదీసుకోవచ్చు. ఈ ఉద్దేశంతో మరో రౌండ్ కాల్చేడు ఇన్స్‌పెక్టర్.

మరుక్షణం, "ఢాం, ఢాం" అంది అవతలి పిస్తోలు.

ఇన్స్‌పెక్టర్ ఎడికాలి తొడని రాసుకుంటూ దూసుకుపోయిందో గుండు. అతని పిస్తోలు ఖాళీ అయిపోయిందన్న ఉత్సాహంతో బాణంలా పరుగు తీశాడతను.

సందు మలుపుదగ్గర చేరుకున్నారిద్దరూ. అప్పుడు గ్రహించి వుంటాడతను తన పిస్తోలులో గుళ్ళు గోవిందా అయిన సంగతి. చటుక్కున వెనుదిరిగి ఇన్స్‌పెక్టర్ డొక్కలో ఒక్కతన్ను తన్నేడు. ఆ మెరుపుదెబ్బకు రాజారెడ్డి నరనాడులూ ఒక్కసారి మూలిగాయి.

పిడికిళ్ళు రెండూ బిగించి, వ్యవధి యివ్వకుండా అతని మొహంమీద పిడుగు దెబ్బలు తీశాడు వరసగా. ఆదెబ్బలకు తాళలేక అతను రెండుచేతులతో మొహం కప్పుకుంటూ వెనుదిరిగాడు పరుగుతియ్యడానికి.

ఇన్స్‌పెక్టర్ వెంటనే అతని నడుంచుట్టూ చేతులు వేసి

ఒడిసి పట్టుకున్నాడు. అతను విడిపించుకోడానికి శక్తి కొలదీ ప్రయత్నించ సాగాడు.

ఆ పెనుగులాటలో హఠాత్తుగా ఇన్స్పెక్టరు చేతికి ఏదో ఊడివచ్చినట్టు తోచింది.

ఆ ఆలోచన రాగానే అవ్యక్తి నడుంమీంచి పట్టు కాస్తా సడలింది. దాంతో అతను ఒక్కవూపున ఇన్స్పెక్టరు కబంధ హస్తాలలోంచి విముక్తుడై, ట్రిగ్గర్ వత్తిన తుపాకీ గుండులా పరుగుతీశాడు.

జేబులోంచి లైటరుతీసి వెలిగించి, తనచేతిలోకి ఊడి వచ్చిన ఆ వస్తువునుచూసి నిర్ఘాంతపోయాడు యిన్స్పెక్టరు.

అది వేలు.

ప్లాస్టిక్‌తో చేసిన నకిలీ చూపుడు వేలు.

ఇన్స్పెక్టరు బుర్రలో వెయ్యి ఓల్టుల బల్బులు చకచక వెలిగి మాయమవుతున్నాయి. ఆ వేలు జేబులో వేసుకుంటూ తిరిగి జీప్ దగ్గరకి నడిచాడు. క్షీరవేణి బెదరిన లేడికూనలా ఫ్రంట్‌సీట్లో ఒదిగి కూర్చునుంది.

ఒంటరిగా వచ్చిన యిన్స్పెక్టర్ని చూసి, "పారిపోయాడా?" అడిగింది.

రాజారెడ్డి తలూపి, "వాడు తప్పించుకు పారిపోడం ఒకందుకు మంచిదే అయింది. రేపు కోర్టులో హంతకుడు అతనేనని నిరూపించడానికి అభేద్యమయిన ఋజువొకటి దొరికింది. ఇక మనం నిశ్చింతగా వెళ్ళవచ్చు" అంటూ జీప్‌లో కూర్చొని, స్టార్ట్‌చేసి వేగంగా ముందుకు పోనిచ్చాడు.

"మీ కభ్యంతరం లేకపోతే రేపు దోషుల్ని బంధించే వరకూ మీరు నా ఇంట్లోనేవుండటం మంచిదనుకుంటాను.

మీ సంరక్షణకోసం నలుగురు మఫ్టీ కానిస్టేబుల్సుని ఇంటి చుట్టూ కాపలా వుంచుతాను. ఏమంటారు?''

క్షీరవేణి తలూపింది మౌనంగా.

తనింటిముందు జీప్ ఆపి, ఆమెను లోనికి తీసికెళ్ళి, నౌఖరు కప్పగించి, హెడ్ క్వార్టర్స్‌కు ఫోన్ చేసి, సార్జంట్ డేవిడ్‌ని అరడజనుమంది సిబ్బందితో తరలి రమ్మని పురమాయించాడు ఇన్స్పెక్టర్.

అరగంట లోపల వచ్చేశారు వాళ్ళు.

ఇంటి నాలుగువైపులా నలుగుర్ని నియమించి, సార్జంటుతో సహా మిగతా యిద్దరు కానిస్టేబుళ్ళతో శ్రీపెక్ట్రా యోగానంద్ ఇంటికి చేరుకున్నాడు ఇన్స్పెక్టర్.

తలుపుకి వేళాడుతున్న తాళంకప్ప స్వాగతమిచ్చింది వాళ్ళకి. నిరాశతో వెనుదిరిగి తిన్నగా డాక్టరు గోపాలశర్మ ఇంటికెళ్ళారు. గంటక్రితమే అతను కారులో బయటకు వెళ్ళినట్టు చెప్పారు ఇంటివాళ్ళు.

''ఆ ఇద్దరిసంగతి రేపు చూసుకోవచ్చు. రేపుదయం నువ్వు గాంధీ మెడికల్ కాలేజికెళ్ళి, ప్రసాద్ అనే యువకుణ్ని నా ఇంటికి పట్టుకురావాలి'' అన్నాడు ఇన్స్పెక్టరు సార్జంటుతో.

8

ఉదయం సరిగ్గా పదిగంటలకు మెడికల్ కాలేజ్ చేరుకున్నాడు సార్జంట్ డేవిడ్. అదే సమయంలో ప్రొఫెసర్ పాండురంగం కొడుకు రవికాంత్ బ్లూఫియట్ వచ్చి ఆగింది కాలేజ్ పార్కింగ్‌లో.

బుక్సూ, ఫైల్సూ పట్టుకుని కారులోంచి దిగాడు రవికాంత్. అక్కడక్కడా నిల్చునికబుర్లు చెప్పుకుంటున్న స్టూడెంట్సువైపు పలకరింపుగా చెయ్యూపుతూ, క్లాసెస్

వేపు నడిచాడు. అమ్మాయిలు అతన్ని చూడగానే మొహాలు చిట్లిస్తూ తలలు పక్కకి తిప్పుకుంటున్నారు.

అయినా రవికాంత్ వాళ్ళవైపు చిలిపిగాచూస్తూ కాలేజ్ వరండాలో ప్రవేశించాడు. అతని వాలకం చూడగానే పసిగట్టాడు సార్జంటు - ఆ యువకుడు దూకుడు స్వభావం, చిలిపి స్వభావం కలవాడయివుంటాడని.

తనూ అతన్ని అనుసరిస్తూ ప్రవేశించాడు కాలేజ్ వరండాలో. రవికాంత్ గ్యాలరీదాటి, లైబ్రరీవైపు తిరుగుతుండగా, వెనకనుంచి ఎవ్వరో అతన్ని పిల్చారు.

చటుక్కున వెనుదిరిగి, "హల్లో ప్రసాద్, నిన్నటి నుంచి కనిపించటం లేదేం? ఎక్కడికెళ్ళావ్?" అంటూ పలకరించి అతన్ని సమీపించాడు రవికాంత్.

ఆ యువకుడ్ని చూడగానే సార్జంటు ఉలికిపడ్డాడు. క్షీరవేణి వర్ణించిన ప్రసాద్ అనబడే యువకుడు అతనే!

"ఏం చెప్పను బ్రదర్! నిన్న సాయంత్రంనుంచి మా నాన్న ఏవూ, అజా లేకుండా పోయాడు. తెలిసిన వాళ్ళందరి దగ్గరా వాకబ్ చేశాం. పత్తాలేదు. ఏం చెయ్యాలో తోచడంలేదు నాకు," అన్నాడు ప్రసాద్ విచారంగా.

"సాయంత్రం డిస్పెన్సరీనించి రానేలేదా?"

"లేదు. డాక్టరుగార్ని అడిగితే, డిస్పెన్సరీ మూశాక ఆరోజు వచ్చిన కేసులతాలూకు రిజిస్టరతో తనవెంట ఇంటికి వచ్చాడనీ, పని పూర్తయ్యాక ఆరున్నర ప్రాంతములో ఇంటికెళ్తున్నానని చెప్పి వెళ్ళిపోయాడనీ తెలిసింది.

ఇంటికి బయలుదేరిన వ్యక్తి యెక్కడికెళ్ళుంటాడు? ఏమయుంటాడు? రాత్రంతా అమ్మకూ, నాకూ నిద్రలేదు.

ఆయన గురించి తీవ్రంగా ఆందోళన పడుతున్నాం!" అన్నాడు ప్రసాద్.

సార్జంటు బుర్రలో మెరుపులా మెరిసింది ఓ ఆలోచన.

చటుక్కున స్తంభంచాటుకు తప్పుకొని జేబిలోంచి డైరీ - బాల్ పెన్ తీసి, సెంటర్ పేజ్ లో గబగబా రాయసాగాడు.

'ప్రసాద్! నేనో చిక్కులో యిరుక్కున్నాను... ఈ వ్యక్తిద్వారా ఈ ఉత్తరం పంపుతున్నాను...యిది చూసిన వెంటనే ఈయనవెంట వచ్చేయ్...వివరాలు ఇక్కడే చెబుతాను.'

డైరీలోంచి ఆ పేజి చింపి, వాళ్ళ వైపుచూశాడు. ఇప్పుడక్కడ రవికాంత్ లేడు. ప్రసాద్ ఒక్కడేనిల్చున్నాడు. గబగబ అటు నడిచాడు సార్జంట్.

ఖంగారు నటిస్తూ, "ప్రసాద్ మీరేకదూ!" అడిగాడు ఆత్రంగా.

"ఔను, మీరెవరు?" అడిగాడతను కనుబొమలు ముడిచి.

"మీ ఇంటికెళితే మీరు కాలేజ్ కొచ్చారని తెలిసింది. ఇక్కడ మీగురించి అడిగితే, అదిగో ఆ అబ్బాయి మిమ్మల్ని చూపించాడు." అంటూ అప్పుడే ఓ క్లాస్ రూంలో కెళుతున్న ఓ యువకుడి వైపు చూపేడు సార్జంట్.

"ఇంతకీ, సంగతేమిటి?" అన్నాడు ప్రసాద్ ఆతృతగా.

"ఈ ఉత్తరం మీకందచెయ్యడానికి వచ్చాను" ఆ కాగితాన్ని తన కందించాడు డేవిడ్.

ప్రసాద్ గబగబ గబగబ ఆ ఉత్తరం చదివి, "ఓహ్, ఎక్కడున్నాడు మా నాన్న?" అడిగాడు ఆందోళనగా.

"నా వెంట రండి చూపిస్తాను" అంటూ పార్కింగ్ వైపు నడిచాడు డేవిడ్. మరేమీ ఆలోచించకుండా గబగబ అతన్ని అనుసరించాడు ప్రసాద్. పార్కింగ్ లో ఆగివున్న ఓ టాక్సీ తలుపు తెరిచి, లోన కూర్చున్నాడు సార్జంట్. అతని వెనకే ప్రసాద్.

"ట్రిప్లికేన్ పోనివ్!" అన్నాడు డేవిడ్ డ్రైవర్ తో.

ఇన్స్పెక్టర్ రాజారెడ్డి యిల్లువున్నది ఆ వీధిలోనే!

టాక్సీ ట్రిప్లికేన్ లో ప్రవేశించగానే, ఇన్స్పెక్టర్ ఇంటిముందు ఆపించి, దిగాడు సార్జంట్. మీటర్ బిల్ పేజేసి ప్రసాద్ ను వెంటపెట్టుకుని ఇంట్లో ప్రవేశించాడు.

వాళ్ళకోసమే ఎదురుచూస్తున్న ఇన్స్పెక్టర్ రాజారెడ్డి, ప్రసాద్ ని కూర్చోమన్నట్టు సైగచేశాడు.

"ఎవరు మీరు? మా నాన్నగారెక్కడ?" అడిగాడు ప్రసాద్ కూర్చుంటూ.

"చెబుతాను. ముందు నా ప్రశ్నలకి జవాబివ్వు. మీ నాన్న పేరేమిటి? ఏం పని చేస్తుంటారు?" అడిగాడు ఇన్స్పెక్టర్ సిగరెట్ అంటించి.

"ఆయినపేరు శ్యామసుందర్! డాక్టర్ గోపాలవర్మ గారిదగ్గర కంపౌండరుగా పనిచేస్తున్నారు!"

ఇన్స్పెక్టరు నోట్లోంచి సిగరెట్ జారి కిందపడింది. "నువ్వు గోపాలవర్మ కంపౌండరు కొడుకువా?"

"ఔను. ఇంతకీ ఎక్కడున్నారాయన? మీరెవ్వరు?" అడిగాడు ప్రసాద్ చిరాకుగా.

"క్రయింబ్రాంచి పోలీసులం..." అని పక్కగది వైపు చూసి, "క్షీరసాగర్!" అంటూ కేకేశాడు ఇన్స్పెక్టర్.

అడుగులో అడుగు వేసుకుంటూ ఆ గదిలోంచి బైటికి వచ్చింది క్షీరవేణి.

ఆమెని చూడగానే ప్రసాద్ ఉలిక్కిపడ్డాను.

"ఈ అమ్మాయి తెలుసా మీకు?" అడిగాడు ఇన్స్పెక్టర్ అతన్ని ఓరగా చూస్తూ.

ప్రసాద్ మొహంలో స్వేదబిందువులు వేరుతో సాగాయి. చూపులు దించుకున్నాడు కిందికి.

"మర్యాదగా అడుగుతుంటే చెప్పాలి. లేదా హెడ్ క్వార్టర్స్‌కి తీసికెళ్ళి ప్రశ్నించాల్సి వుంటుంది. అక్కడ ప్రశ్నించే పద్ధతి ఎలావుంటుందో బహుశా నీవు వినే వుంటావు" అన్నాడు ఇన్స్పెక్టరు నవ్వుతూ.

ప్రసాద్ తలెత్తకుండానే, "తెలుసు!" అన్నాడు నీరసంగా.

"రెండురోజుల క్రితం ఈమెని బజార్లో అల్లరిపెట్టింది నీవే కదూ?"

"నేను కావాలని అల్లరిపెట్టలేదు. ఓ పందెం గెలవటానికి ఆ పని చేశాను."

"పందెం గెలవటానికా? ఎవరు కాశారు నీతో పందెం?"

"రవికాంత్! తరుచూ వాడు నాతో ఇలాటి పందాలు కాస్తుంటాడు. ప్రతిసారీ ఓడిపోతుంటాడు. వాడికి అమ్మాయిల్ని ఏడిపించటమంటే సరదా! నాకు వాడి జేబులు ఖాళీచెయ్యడమంటే సరదా!

అలా వాడిపుణ్యమా అని నా నెలసరి పాకెట్ మనీకి పుష్కలంగా దొరుకుతుంది డబ్బు! మీరే చెప్పండి, ఒక మామూలు కంపౌండరు తన కొడుకు పాకెట్ మనీ భరించ గలడా ఈ రోజుల్లో? అందుకే వాడు చెప్పిన అమ్మాయి

నల్లా యిష్టంలేకున్నా ఏడిపించి నా పబ్బం గడుపు కుంటుంటాను.

ఆ రోజు కూడా నేనూ, రవికాంత్ వాడి కార్లో కాలేజీకెళ్తుండగా, ఫుట్ పాత్ మీద నడుస్తున్న ఈమె కనిపించింది. వాడు వెంటనే కారు ఓ పక్క ఆపి, ఈమెని గనక అల్లరిపెట్టి దాదాపు అరగంట వరకూ ఇక్కడించి కదలకుండా చేశానంటే వెయ్యిరూపాయలు ఇస్తా నన్నాడు. అంత పెద్ద మొత్తాన్ని వాడు పందెం కాయడం ఇదే ప్రథమం!

వెయ్యిరూపాయలనగానే నా కళ్ళు జిగేల్ మన్నాయి. వెంటనే ఒప్పుకున్నాను. రవికాంత్ అక్కడే దిగిపోయి, నన్ను కార్లో ఆమె వెంట పడమని పురమాయించాడు.

నేనామె వెనక నెమ్మదిగా కారు నడుపుతూ కామెంట్స్ విసరసాగాను. పదినిమిషాల వరకూ ఓపిగ్గా వాటిని భరించింది. నేను మితిమీరడంతో చటుక్కున ఆగి గొడవ ప్రారంభించింది. దాంతో నలుగురూ పోగయ్యారు. దేహశుద్ధి జరక్కముందే అక్కణ్ణించి జారుకోవడం మంచిదని కార్లో పారిపోయాను..." అంటూ నీళ్ళు నమిలాడు ప్రసాద్.

ఇన్స్పెక్టర్ చటుక్కున సార్జంట్ వైపు తిరిగి, "వెంటనే కాలేజ్ కెళ్ళి రవికాంత్ ని ఇక్కడికి తీసుకు రా!" అంటూ పురమాయించేడు.

9

అరగంట లోపల రవికాంత్ తో తిరిగివచ్చాడు సార్జంట్ డేవిడ్.

లోపలకూర్చున్న ఇన్స్పెక్టర్నీ, క్షీర వేణిని, ప్రసాద్ నీ చూడగానే ఉలిక్కిపడ్డాడతను.

“మిస్టర్ రవికాంత్! రెండురోజుల క్రితం మీరు మీ స్నేహితుణ్ణి ఈ అమ్మాయిని నడిరోడ్లో అల్లరిపెట్టడానికి వాడుకున్నారు కదూ?” అడిగాడు ఇన్స్పెక్టరు అతను కూర్చోగానే.

రవికాంత్ కాసేపు తటపటాయించి, “అది పందెం! నాతోనూ ఒకరు కట్టిన పందెం ఇన్స్పెక్టర్!” అన్నాడు వణికే కంఠంతో.

“ఎవరు కట్టారు?”

“యోగానంద్!”

“అతనికీ, మీకూ ఏమిటి పరిచయం?”

“మా నాన్నగారు సైంటిస్టు. ఆయన సైంటిఫిక్ ఎక్విప్ మెంట్సన్నీ వాళ్ళ కంపెనీ ద్వారానే ఫారిన్ సించి తెప్పిస్తారు. ఆ విధంగా అతనికీ, నాన్నగారికీ పరిచయం వుంది. తరుచూ మా ఇంటికి వస్తూంటాడు. అలా నాకూ పరిచయమయ్యాడు.”

“మీ నాన్నగారి స్నేహితుడైన అతను, మీతో అటువంటి పోకిరీపందెం కాస్తాడా?”

“నమ్మండి! ఇప్పుడతనికి ముప్పైఅయిదేళ్ళుంటాయి. ఐనా, ఇంతవరకూ పెళ్ళిచేసుకోలేదు. తరుచూ మా ఇంటికి వచ్చి నాతో టేబుల్ టెన్నిస్ ఆడుతూంటాడు. ఆ విధంగా మా మధ్య కాస్త చనువు ఏర్పడింది. కబుర్లలో అప్పుడప్పుడూ మా మధ్య అమ్మాయిల విషయం కూడా వచ్చేది.

ఓ రోజు టెన్నిస్ ఆడుతూ అతడు క్షీరవేణి విషయం కూడా ఎత్తాడు. తనామెను మనసారా ప్రేమిస్తున్నాననీ, త్వరలో పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాననీ, ఐతే ఈ లోగా ఆమె నడవడిని పరీక్షించదలచాననీ, ధనవంతు

డైన యువకుడెవ్వడైనా ప్రయత్నిస్తే ఆమె లిఫ్ట్ ఇస్తుందేమో చూడదలచాననీ, ఒకవేళ ఆమె క్యారెక్టర్ మంచిదని తేలితే తను వెయ్యిరూపాయలు ఓడడానికి సిద్ధమనీ చెప్పాడు.

ఉద్యోగాలు చేసి బ్రతికే పెళ్ళికాని అమ్మాయిలపై నాకు నమ్మకంలేదనీ, అటువంటి వాళ్ళని లొంగదీసుకోడం చిటికెలో పననీ, ఇదివరకు అలాటివాళ్ళనెందర్నో చూశాననీ, ఈ విషయంలో నేనోడితే వెయ్యిరూపాయలు చెల్లిస్తాననీ చెప్పాను.

ఇలాంటి వ్యవహారాల్లో ప్రసాద్ ఆరితేరిన ఘటికుడు. వాణ్ణడ్డం పెట్టుకుని ఇదివరకెందరో అమ్మాయిల్ని ఏడిపించాను. ఈ పని కూడా వాడికే అప్పగించాను...” అన్నాడు రవికాంత్ తల వంచుకుంటూ.

ఇన్స్పెక్టరు పలకలేదు. కాసేపు ఆలోచించి లేచాడు. “పదండి యోగానంద్ ఇంటికెళ్దాం!” అని శ్రీరవేణిని అక్కడే వదిలి మిగతా ముగ్గురితో జీప్ ఎక్కాడు.

10

ఇప్పుడు యోగానంద్ ఇంటికి తాళంలేదు. తలుపులు మూసున్నాయి.

జీప్ దిగగానే తలుపుతట్టాడు ఇన్స్పెక్టర్.

“కమిన్!” వినిపించింది లోపలనించి.

తలుపు తోసుకుంటూ అందరూ లోన అడుగుపెట్టారు. ముందుగదిలో ఎవ్వరూ లేరు.

“ఇక్కడున్నాను. రండి లోపలికి” వినిపించింది పక్కగదిలోంచి.

ఇన్స్పెక్టర్ సార్జంట్ ని దగ్గరికి పిల్చి, అతని చెవిలో ఏదో చెప్పాడు. సార్జంట్ తలూపి, ఇంట్లోంచి బైటికెళ్ళి

పోయాడు. రవికాంత్, ప్రసాద్‌లతో పక్కగదిలో ప్రవేశించి స్థాణువైపోయాడు ఇన్‌స్పెక్టర్.

ఆ గదిలో అసలే వెలుతురులేదు. మసక చీకటి. ఎదురుగావున్న కిటికీకడ్డంగా నిల్చున్నాడతను. చెవులవరకూ కాలర్ ఎత్తిన డార్క్ బూడిదరంగు లాంగ్ కోట్. అదే రంగు హాటు. తలమీద బాగా ముందుకు లాగిపెట్టుకున్న ఫెల్ట్ హాట్. కళ్ళకి అద్దాలు.

కుడిచేతిలో సూటిగా వాళ్ళవైపు గురిపెట్టివున్న పిస్తోలు!

"ఇక మీ రెవ్వరూ బ్రతికి బైటపడలేరు. ఈ దేశం నించి పారిపోడానికి అన్ని ఏర్పాట్లూ పూర్తిచేసుకున్నాను.

సుగంధరావునీ, కంపౌండర్ని చంపింది నేనే! నేను క్షీరవేణిని మనసారా ప్రేమించాను. ఐతే, ఆమె నన్ను లెక్కచేసేదికాదు. దాంతో, సుగంధరావుకూ, ఆమెకూ అక్రమసంబంధమేదో ఏర్పడటు నా కనుమానం వేసింది. సుగంధరావుమీద కసితో నా హృదయం భగ్గుమంది.

పథకం వేశాను. డాక్టర్ గోపాలవర్మ దగ్గర పనిచేసే కంపౌండరు ద్వారా గేస్ట్రిక్ విషాన్ని సంపాదించి, దాంతో క్షీరవేణి రసినట్టు ఓ వుత్తరం రాసి, సుగంధరావు బల్లమీద పెట్టా...అది చదవగానే కాల్చి పారేశాడు ... ఫలితంగా మృత్యువాతబడ్డాడు ... ఆ విషపు రహస్యం తెలిసిన కంపౌండర్ని కూడా దారికడ్డు తొలగించుకున్నాను.

ఇక ముగ్గురూ చేతులెత్తి బుదిగా గోడవైపు తిరిగి నిల్చోండి. నా దారి కడ్డుపడ్డారో అందర్నీ ఇక్కడే.."
అతని మాట యింకా పూర్తికాలేదు.

"ఢాం! ఢాం!!" అనే శబ్దాలతో గది మారుమోగింది.

అతను రెండుభుజాలూ అదుముకుంటూ గావుకేక పెట్టాడు. మరుక్షణం చేతిలోంచి పిస్తోలు జారి ఖంగుమంది. ప్రసాద్, రవికాంత్ ఆశ్చర్యంగా అతని వెనక వున్న కిటికీవైపు చూశారు.

కిటికీ ఊచలమధ్య పిస్తోలు ఆనించి నిల్చునున్నాడు సార్జంట్. ఇన్స్పెక్టరు వెంటనే కిందపడ్డ పిస్తోలందుకుని చిన్నగా నవ్వుతూ అతన్ని సమీపించాడు.

“నీవు నిజంగా యోగానంద్‌వైతే, ఈ అవతార మెందుకు?” అంటూ అతని ఫెల్ట్‌హాట్, కళ్ళద్దాలు తీసేశాడు.

“నాన్నా! మీరా!!” అన్నాడు రవికాంత్ దిగ్భ్రాంతితో.

ప్రొఫెసర్ పాండురంగం తల దించుకున్నాడు కొడుకువైపు చూడలేక.

అప్పుడు పడింది ఇన్స్పెక్టర్ దృష్టి అతని ఎడంచేతి మీద. ఆ అరచేతికి వేళ్ళు కనిపించకుండా కర్చీఫ్ చుట్టి వుంది. ఇన్స్పెక్టర్ వెంటనే దాన్ని లాగేశాడు.

ఆ చేతికి బొటనవేలు లేదు.

“ఏరోజైతే, నీ కొడుకు రవికాంత్ గురించి వాకబ్ చెయ్యడానికి మీ ఇంటికి వచ్చి, నీతో మాట్లాడానో అప్పుడే నా కనుమానం వేసింది, నీ బొటనవేలు నకిలీదని. అదృష్టవశాత్తు నిన్నరాత్రి ఆ చీకటిసందులో నాతో కలియబడ్డప్పుడు ఆ వేలు కాస్తా ఊడి నా చేతిలోకి వచ్చింది.

మొత్తానికి యోగానంద్ ఒడ్డూపొడుగుని నీ పథకానికి బాగానే వాడుకున్నావ్. ఇప్పుడతనెక్కడున్నాడు? ఏం చేశావతన్ని?” అడిగాడు ఇన్స్పెక్టర్ కర్కశంగా.

ప్రొఫెసర్ పలకలేదు. కాసేపు ఆలోచించి, ఏమనుకున్నాడో ఏమో, మెల్లిగా తలెత్తాడు. "సుగంధరావు నా బద్దవిరోధి. సుగంధరావునూ, కంపౌండర్నీ నేనే హత్యచేశాను.

సుగంధరావు మరణం తరవాత నన్ను బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బు గుంజడానికి ప్రయత్నించాడు కంపౌండరు. దాంతో, వాణ్ణి మట్టుబెట్టడానికి నిర్ణయించాను. నిన్న సాయంకాలం వాడు డాక్టర్ ఇంటికి వచ్చినప్పుడు నేనక్కడే వున్నాను. వాడికి తెలీకుండా టీలో విషం కలిపి యిచ్చాను. అదే సమయంలో యోగానంద్ వచ్చాడక్కడికి.

వెళ్ళేటప్పుడు తనని ఇంటివరకూ డ్రాప్ చెయ్యవలసిందిగా కోరాడు కంపౌండర్ అతన్ని. యోగానంద్ కంపౌండర్ని కారెక్కించుకుని తీసికెళ్ళాడు. బహుశా, దార్లో అతని పరిస్థితి విషమించేసరికి, భయపడి కిందికి తోసి పారిపోయాంటాడు.

యోగానంద్ మీద మీ అనుమానం బలపడటానికే రాత్రి మీ వెంట జీపులో బైలుదేరబోతున్న క్షీరవేణి మీద పిస్తోలు పేల్చాను...దురదృష్టవశాత్తు ఆ గొడవలో నా బొటనవేలు ఊడిపోయింది...దాంతో యోగానంద్ని మట్టుబెట్టడం అనివార్యమైపోయింది.

రేపు యోగానంద్ చెయ్యి చెక్ చేస్తే అతని చేతికి అన్నివేళ్ళూ నిక్షేపంగా వున్నప్పుడు అతనిమీద మీకేర్పడ్డ అనుమానం తొలగడం సహజమే కదా?

అతన్ని చంపి, ఆ శవాన్ని మరొకంటికి కన్పించకుండా మాయంచేస్తే యోగానంద్ మద్రాసు వదిలి ఎటో

పారిపోయాడనుకుంటారు పోలీసులు. ఆ విధంగా నేను సేఫ్ అవుతాను...

ఆ వుద్దేశంతో నే ఇక్కడికి వచ్చాను. పిస్తోలుతో అతన్ని కాల్చి చంపాను. ఆ శవాన్ని గ్యారేజ్ లో వున్న అతని కార్లోకి చేర్చాలనుకుంటుండగా మీరొచ్చారు'' అన్నాడు ప్రొఫెసర్ రక్తం కారుతున్న భుజాల గాయాల నదుముకుంటూ.

అతన్ని సార్జంట్ కప్పగించి, గబగబ బెడ్ రూంలో కెళ్ళాడు ఇన్స్పెక్టర్.

నేలమీద పడుంది యోగానంద్ శవం!

వెల్లకిలా! చలనరహితంగా!!

——:ఐపోయింది:——